# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 224

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy   సంపాదకులు : కె.భాస్కర్‌రావు   రూ.2.00/- పేజీలు 8   తేది: గురువారం 17 సెప్టెంబర్ 2026








**సమయం ప్రతినిధి:** కోవూరులో టీడీపీ కార్యకర్తలు, నేతల సమన్వయ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. నెల్లూరులో తనకు పలికిన స్వాగతం ఎప్పటికీ మర్చిపోలేనని అన్నారు. ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన సమయంలో తొలి కార్యకర్తగా బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన బెజవాడ పాపిరెడ్డి ఉన్నారని గుర్తుచేశారు. డబ్బులు ఎంతో మంది సంపాదిస్తారని.. అయితే ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన వీపీఆర్ దంపతుల్లో చూశానని లోకేశ్ అన్నారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే వారు రాజకీయాల్లోకి వచ్చారని పేర్కొన్నారు. జిల్లాలో ఒక నాయకుడు తమ పార్టీ గెలవకపోతే రాజకీయ సన్యాసం చేస్తానని శపథం చేశారని, ఇప్పుడు ఆయన ఏమయ్యారని ప్రశ్నించారు. టీడీపీ మహిళలను గౌరవిస్తుందని లోకేశ్ అన్నారు. వైఎస్ భారతి గురించి సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన టీడీపీకి చెందిన వారిని కూడా తాను జైలుకు పంపించానని చెప్పారు. కార్యకర్తే పార్టీకి అధినేత అని పేర్కొన్నారు. రాష్ట్రంలో 45 వేల మంది కార్యకర్తలు, కోటి 60 లక్షల ఇళ్లకు 'గడప గడపకు' వెళ్లారని లోకేశ్ తెలిపారు. పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని కార్యకర్తలు సమర్థంగా పూర్తి చేయాలని సూచించారు. సంక్షేమం, అభివృద్ధి అనేది జోడి ఎద్దుల బండిలా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తాయని అన్నారు. రాష్ట్రం పరిశ్రమలు, పెట్టుబడులకు వేదికగా మారుతోందని పేర్కొన్నారు. ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వారు కూడా తనను ప్రశ్నిస్తున్నారని లోకేశ్ అన్నారు.




**సమయం ప్రతినిధి:** ఈపీఎఫ్ వేతనదారులకు గుడ్ న్యూస్. పీఎఫ్ కనీస వేతన పరిమితి పెంపునకు కేంద్ర కేబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. రూ.15 వేల పరిమితిని రూ.25 వేలకు పెంచేందుకు నిర్ణయించింది. దీంతో, కొత్తగా 51 లక్షల మంది ఈపీఎఫ్ఓ కవరేజీ పరిధిలోకి రానున్నారు. పీఎఫ్ కనీస వేతన పెంపుతో మరింత మంది వర్కర్లకు సామాజిక భద్రత లభిస్తుందని కార్మిక శాఖ పేర్కొంది. 2014లో చివరిసారిగా ప్రభుత్వం కనీస వేతనాన్ని రూ.15 వేలకు పెంచింది. వేతనాల వృద్ధి, ఆదాయాల వృద్ధి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రం పీఎఫ్ కనీస వేతనాన్ని పెంచేందుకు నిర్ణయించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం, రూ.15 వేలు, అంతకుమించి నెలవారీ వేతనంతో ఉద్యోగంలో చేరే వారు ఆటోమేటిక్‌గా ఈపీఎఫ్ పరిధిలోకి రారు. ఈ పరిమితి పెంపుతో రూ.25 వేల వరకూ వార్షిక వేతనం ఉన్న వారు ఆటోమేటిక్‌గా పీఎఫ్ పరిధిలోకి వస్తారు. పీఎఫ్ సేవింగ్స్, పెన్షన్, ఇన్సూరెన్స్ సదుపాయం వంటివి వారికి అందుబాటులోకి వస్తాయి. వేతన పెంపుపై వివిధ మంత్రిత్వ శాఖలతో సంప్రదింపుల అనంతరం కేంద్రం తుది నిర్ణయం తీసుకుంది. ఈపీఎఫ్ఓ డేటా ప్రకారం, ప్రస్తుతం 7.98 కోట్ల మంది పీఎఫ్ సభ్యులు ఉన్నారు. 82 లక్షల మందికి పీఎఫ్ పెన్షన్ సదుపాయం ఉంది.




**సమయం ప్రతినిధి:** అంతర్జాతీయ జలాల్లో భారత నౌకాదళానికి చెందిన ఓ నౌకను పాకిస్థాన్ నౌకాదళానికి చెందిన నౌక ఢీకొన్న ఘటనపై విదేశాంగ శాఖ స్పందించింది. ఈ ఘటనపై నిరసన వ్యక్తం చేసేందుకు ఢిల్లీలోని పాకిస్థాన్ దౌత్య అధికారి సాద్ అహ్మద్ వర్రాయిచ్‌ను భారత విదేశాంగ శాఖ బుధవారం పిలిపించింది. పాకిస్థాన్ నౌకాదళం వ్యవహరించిన తీరు అంగీకరించలేనిదని, వృత్తిపరంగా సరికానిదని భారత్ పేర్కొంది. ఈ ఘటన సెప్టెంబర్ 15 సాయంత్రం ఉత్తర అరేబియా సముద్రంలో చోటుచేసుకుంది. ఒమన్‌కు సుమారు 220 కిలోమీటర్ల తూర్పున సాధారణ నిఘా విధుల్లో ఉన్న భారత నౌకాదళ యుద్ధనౌకకు పాకిస్థాన్ నౌకాదళ నౌక అత్యంత సమీపంగా వచ్చింది. భారత వర్గాల ప్రకారం, పాకిస్థాన్ నౌక అధిక వేగంతో, సురక్షితం కాని రీతిలో దిశ మార్చుకుంటూ రావడంతో ఢీకొట్టింది. అయితే ఈ ఘటనలో ఎలాంటి భారీ నష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. ఢీకొన్న తర్వాత రెండు నౌకలు అక్కడి నుంచి విడిపోయినట్లు సమాచారం. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని తగిన జాగ్రత్తలు పాటించాలని పాకిస్థాన్ అధికారులకు తెలియజేయాలని భారత విదేశాంగ శాఖ పాక్ దౌత్యవేత్తకు సూచించింది (Indian Navy Pakistan incident). ఇస్లామాబాద్‌లోని భారత దౌత్యవేత్త కూడా పాకిస్థాన్ విదేశాంగ శాఖకు ఇదే అంశంపై నిరసన తెలియజేయనున్నట్లు భారత్ తెలిపింది.




**హైదరాబాద్, సెప్టెంబర్ 16, సమయం ప్రతినిధి :** మాజీ సీఎం కేసీఆర్, కల్వకుంట్ల కుటుంబంపై అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవెల్లిలో ఉన్న కేసీఆర్ ఫాంహౌస్‌పై విచారణకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. నోటీసులు ఇచ్చి విచారణ జరపాలని.. విచారణ జరపకపోతే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. 30 రోజుల్లో విచారణ నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. కేసీఆర్ ఫాంహౌస్‌కు ఎస్సీలను యజమానులుగా చేస్తామని ప్రకటించారు. కేసీఆర్ ఫాంహౌస్ ఆధీనంలో 700 ఎకరాలు ఉందని.. ఫాంహౌస్ భూమిని తేల్చాలని కలెక్టర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. 30 రోజుల్లోనే కేసీఆర్ ఫాంహౌస్ నుంచి భూమి స్వాధీనం చేసుకుని పేదలకు పంచుతామన్నారు. ఏ భూమినైతే శుద్ధి చేశారో అదే భూమికి ఎస్సీలను యజమానులను చేస్తామని ప్రకటించారు. కేసీఆర్‌కు తక్షణం నోటీసులు ఇచ్చి భూమి స్వాధీనం చేసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సత్యం స్కాంలో ఉన్న భూముల్లోనే కేటీఆర్ ఫాంహౌస్ ఉందన్నారు. సత్యం స్కాంలో ఉన్న భూములు.. కేటీఆర్ బంధువుల పేరుతో బదిలీ అయ్యాయని చెప్పారు. సిద్దిపేట మున్సిపాలిటీ నిధులతో హరీశ్ రావు ఫాంహౌస్‌కు రోడ్లు వేయించినట్లు తెలిపారు. ఇరిగేషన్‌కు తీసుకున్న భూమిలోనే హరీశ్ రావు ఫాంహౌస్ ఉందన్నారు. హైదరాబాద్ బాలానగర్‌లో 120 ఎకరాలను హరీశ్ రావు కుటుంబ సభ్యులు కొల్లగొట్టారని ఆరోపించారు. ఫిర్యాదు చేయడానికి కూడా బాధితులు భయపడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం, ధరణిని అడ్డుపెట్టుకుని దోపిడీ చేశారని సీఎం ఆరోపించారు. కేసీఆర్ కుటుంబంలో ఎవరి పేరు మీద ఎన్ని ఎకరాల భూములు ఉన్నాయనే వివరాలను అసెంబ్లీ సాక్షిగా బయటపెట్టారు. కల్వకుంట్ల ఫ్యామిలీకి 440 ఎకరాల భూమి, కేసీఆర్ దంపతుల పేరిట 67 ఎకరాలు, కేటీఆర్ కుటుంబంలో నలుగురి పేరుతో 123 ఎకరాలు ఉన్నట్లు వెల్లడించారు. అలాగే కేటీఆర్ పేరుపై 49.5 ఎకరాలు, శైలిమ పేరుపై 17.5 ఎకరాలు, అలేఖ్య పేరుపై 9.38 ఎకరాలు, హిమాన్ష పేరుమీద 46.3 ఎకరాలు ఉన్నాయన్నారు. అంతేకాకుండా హరీశ్ రావు కుటుంబానికి 30 ఎకరాలు, కవిత కుటుంబానికి 37 ఎకరాలు, సంతోషరావు కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్‌రావు పేరుపై 52 ఎకరాలు, కొండల్‌రావు పేరుపై 48 ఎకరాల భూమి ఉందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.




**సమయం ప్రతినిధి :** మాజీ మంత్రి హరీశ్‌రావుపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. హరీశ్‌రావు భూ దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. భూదాన్ భూమిని ఆయన కుటుంబం ఎలా రిజిస్ట్రేషన్ చేసుకుంటుంది? అని ప్రశ్నించారు. అసెంబ్లీలో మీడియాతో మంత్రి పొంగులేటి ఇవాళ (బుధవారం) చిట్‌చాట్ చేశారు.

**22ఏ భూముల విషయంలో కీలక నిర్ణయాలు ఉంటాయి..**

ప్రభుత్వ భూమిని ఏ ప్రభుత్వ హయాంలో రిజిస్ట్రేషన్ చేసినా తప్పేనని మంత్రి చెప్పుకొచ్చారు. హరీశ్‌రావు బుద్ధి ఎక్కడ పోయింది? అని నిలదీశారు. 22ఏ కింద నాలుగు లక్షల ఎకరాల భూమి మాత్రమే ఉందని.. మిగతాదంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంకా 40 వేల ఎకరాల భూమిని 22ఏ నుంచి తగ్గించామని స్పష్టం చేశారు. 22ఏ భూముల విషయంలో కీలక నిర్ణయాలు ఉంటాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

**తహసీల్దార్ కార్యాలయాలు అద్దెభవనాల్లో నడుస్తున్నాయి..**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఈరోజు (బుధవారం) ప్రారంభమయ్యాయి. తహసీల్దార్ కార్యాలయాల గురించి సభలో చర్చ జరిగింది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొంగులేటి సమాధానం ఇచ్చారు. చాలా చోట్ల తహసీల్దార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.640 కోట్లతో కొత్త ఎమ్మార్వో భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయాలను నిర్మించడం కోసం టెండర్లు పిలిచామని చెప్పుకొచ్చారు. అవసరమైన ప్రాంతాల్లో ఎమ్మార్వో, ఆర్డీవో కార్యాలయాలను నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఆదిలాబాద్‌లో నిర్మాణంలోని కార్యాలయాన్ని త్వరగా నిర్మించి ప్రారంభిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.




**సంగారెడ్డి, సమయం ప్రతినిధి :** వినాయక నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకుని ఆరుగురు విద్యార్థులు మృతి చెందారు. పటాన్ చెరు మండలం పెద్ద కంజర్ల గ్రామంలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. పెద్ద కంజర్లలోని నేరేడు చెరువులో వినాయక విగ్రహ నిమజ్జనం కోసం వెళ్లిన బాలురు ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోయారు. ఈత రాకపోవడంతో ఆరుగురు విద్యార్థులు మృతి చెందినట్లు తెలిసింది. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతులు స్థానికంగా ఉన్న శిరీష చారిటబుల్ ట్రస్ట్‌లో చదువుతున్న విద్యార్థులుగా సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

**మృతుల వివరాలు :**

నర్సింహా రాజు – బిటెక్, సుమంత్ – డిప్లమా సెకండ్ ఇయర్, గణేష్ – డిప్లమా సెకండ్ ఇయర్ ఉదయ్ కిరణ్ – డిప్లమా థర్డ్ ఇయర్, శ్యాంకుమార్ – డిప్లమా ఫస్ట్ ఇయర్, సిదర్థ్ – టెన్త్.

## ఆసియా పతకం సాధిస్తే నేరుగా ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు ఎంట్రీ

**సమయం ప్రతినిధి :** భారత బాక్సర్లకు బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (BFI) కీలక ప్రకటన చేసింది. 2026 ఆసియా గేమ్స్‌లో పతకాలు సాధించే భారత బాక్సర్లకు 2027 వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో నేరుగా ప్రవేశం కల్పించనున్నట్లు వెల్లడించింది. 2027 వరల్డ్ ఛాంపియన్‌షిప్.. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు తొలి క్వాలిఫయింగ్ ఈవెంట్‌గా ఉండనుంది. ఈ టోర్నీకి వీలైనంత ఎక్కువ మంది భారత బాక్సర్లను పంపించడమే లక్ష్యంగా బీఎఫ్ఐ నాలుగు దశలతో కూడిన అర్హత విధానాన్ని రూపొందించింది. 2026 ఆసియా గేమ్స్‌లో పతకం సాధించిన బాక్సర్‌కు.. పోటీ చేసిన వెయిట్ కేటగిరీలో 2027 వరల్డ్ ఛాంపియన్‌షిప్‌కు ప్రధాన ఎంట్రీ లభిస్తుంది. అదే వెయిట్ కేటగిరీలో 10వ ఎలైట్ నేషనల్ ఛాంపియన్‌షిప్స్‌లో స్వర్ణ పతకం సాధించిన బాక్సర్‌ను రిజర్వ్ ఎంట్రీగా పరిగణిస్తారు. ఒకవేళ ఆసియా గేమ్స్‌లో భారత్‌కు ఏ వెయిట్ కేటగిరీలోనూ పతకం రాకపోతే.. ఆ విభాగంలో 10వ ఎలైట్ నేషనల్స్ విజేతను ప్రధాన ఎంట్రీగా ఎంపిక చేస్తారు. ఆసియా గేమ్స్‌లో నిర్వహించని ఒలింపిక్ వెయిట్ కేటగిరీలకు కూడా ఇదే విధానం వర్తిస్తుంది.







**సమయం ప్రతినిధి :** బీఆర్ఎస్ హయాంలో పెద్దఎత్తున భూకబ్జాలు జరిగాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు లక్షల ఎకరాల భూములను కబ్జా చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ భూకబ్జాలపై తాను మాట్లాడిన సమయంలో తన తలను ఆరు ముక్కలు నరుకుతానని కేసీఆర్ అన్నారని గుర్తుచేశారు. కేసీఆర్‌ను మెడలు వంచి బయటకు గుంజుకొచ్చింది తానేనని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం తమకు రావాల్సి ఉండగా తృటిలో కాంగ్రెస్ చేతికి వెళ్లిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన భూకబ్జాలను బయటపెట్టడానికి రేవంత్ రెడ్డికి వెయ్యి రోజులు పట్టిందా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్ మధ్య డీల్ కుదరలేదా? ఏఐసీసీకి ఈఎంఐ కట్టడం ఇబ్బందిగా ఉందా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ప్రతి అసెంబ్లీ సమావేశంలోనూ బీఆర్ఎస్‌కు రేవంత్ రెడ్డి ఆఫర్లు ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌లో పనిచేసిన సుమారు 90 మంది ఎమ్మెల్యేలు భూకబ్జాలకు పాల్పడ్డారని బండి సంజయ్ ఆరోపించారు. డ్రగ్స్, ఈ-ఫార్ములా, ఫోన్ ట్యాపింగ్, ఫామ్‌హౌస్ కేసుల దర్యాప్తు ఏమైందని ప్రశ్నించారు.

# సంపాదకీయం

## బీజేపీ రాజకీయాలకు బ్రిక్స్ పాఠం!

'లోకంలో బలవంతుడైనవాడు చెబితే అధర్మం కూడా ధర్మం అవుతుంది. అదే బలహీనుడు చెప్పే ధర్మం ఎంత గొప్పదైనా దాన్ని ఎవడూ అంగీకరించడు' అని మహాభారతంలో భీష్ముడు కురుసభలో ద్రౌపది వస్త్రాపహరణ ఘట్టంలో చెబుతాడు. 'పాండవులకు జరిగిన అవమానమే భవిష్యత్తులో కౌరవులకు వ్యతిరేకంగా ప్రత్యర్థులందర్నీ ఏకం చేస్తుంది' అని అదే సభలో విదురుడు హెచ్చరిస్తాడు. 'బలవంతుడి శక్తి కంటే భయంతో ఏకమైన బలహీనుల కూటమి శక్తిమంతమైనది' అని విదురుడు చెప్పినట్లుగానే పాంచాల, మత్స్య, యాదవ, మగధ, ఛేది, కాశీ, పాండ్య, చోళ, కేకయ తదితర రాజ్యాలన్నీ పాండవుల తరపున ఏకం అవుతాయి. చాణక్యుడైనా, ఇటాలియన్ రాజనీతిజ్ఞుడు మాకియవెల్లీ అయినా ఇంతకంటే భిన్నంగా ఏమీ ఆలోచించలేదు. న్యూఢిల్లీలో గతవారం ముగిసిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మహాభారతంలోని దౌత్యనీతి ప్రస్ఫుటించింది. తాను అత్యంత బలవంతుడిననుకున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను వ్యక్తిగతంగా బ్రిక్స్ దేశాలు పైకి పల్లెత్తు మాట అనకుండానే ఆయనకు ఒక స్పష్టమైన సందేశాన్ని పంపించాయి. ఏక పక్ష దౌర్జన్య చర్యలు, వర్తకాన్ని దెబ్బతీసే టారిఫ్ లను న్యూఢిల్లీ డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. బ్రిక్స్ వేదికపై విభిన్న ప్రయోజనాలను ఆశిస్తున్న అనేక దేశాలు ఏకమయ్యేందుకు అవసరమైన వాతావరణాన్ని ట్రంప్ అనాలోచితంగానే అందించారు. సంక్షుభిత ప్రజాస్వామ్య భారత్, నియంతృత్వ చైనా, రష్యా దేశాలు, అమెరికాతో సన్నిహిత భద్రతా సంబంధాలు ఉన్న గల్ఫ్ దేశాలు, అమెరికా దాడిని ఎదుర్కొంటున్న ఇరాన్.. ఇవన్నీ ఒక వ్యూహాత్మక ప్రాపంచిక దృక్పథాన్ని పంచుకునేందుకు అవకాశాన్ని ట్రంప్ కల్పించారు. అమెరికా అధ్యక్షుడి దూకుడు విధానాల వల్ల ఈ దేశాలన్నీ ఒత్తిడి ఎదుర్కోవడమే ఇందుకు కారణం. డాలర్ ఆధిపత్యాన్ని సవాల్ చేసే దేశాలపై అత్యధిక సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించినప్పటికీ బ్రిక్స్ దేశాలు ప్రత్యామ్నాయ చెల్లింపు విధానాలను వెతుక్కునేందుకు ఆయనే దోహదం చేశారు. వాణిజ్యం కోసం, స్థానిక జాతీయ కరెన్సీల వాడకాన్ని న్యూఢిల్లీ డిక్లరేషన్ సమర్థించింది. పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు ఇది సభ్య దేశాలకు ఊతమిచ్చింది. భిన్న రాజకీయ వ్యవస్థలు, భద్రతా ప్రయోజనాలు కలిగిన కూటమి అయినప్పటికీ ఎలాంటి రణగొణ ధ్వనులు లేకుండా బ్రిక్స్ సమావేశంలో అత్యంత సమగ్రమైన, ప్రభావదాయక ఏకగ్రీవ డిక్లరేషన్‌ను విడుదల చేయగలగడమే ఆ దేశాల మధ్య ఏర్పడిన ఉమ్మడి అవగాహనకు నిదర్శనం. ప్రస్తుత అంతర్జాతీయ వ్యవస్థ ఏకపక్ష ఆర్థిక ఒత్తిళ్లకు గురవుతోందనే సాధారణ భావనే వీటన్నింటినీ ఒక తాటిపైకి తెచ్చింది. ఈ సదస్సుకు భారత్ నాయకత్వం వహించినందువల్ల సహజంగానే రెండు రోజుల పాటు జరిగిన సదస్సుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేంద్ర బిందువుగా నిలిచారు. భారత్ ప్రస్తుత పరిస్థితి కత్తి మీద సాము లాంటిది. పలు వైరుధ్యాలతో కూడిన సంబంధాలను ఏకకాలంలో సమన్వయం చేసేందుకు భారత్ ప్రయత్నించాల్సి వచ్చింది. చైనాతో సరిహద్దు ఘర్షణలు, ఆర్థిక ఆధిపత్యం నేపథ్యంలో ఆ దేశాధినేతతో సుహృద్భావ వాతావరణంలో చర్చించడం, రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగించడం, సంక్షుభిత పశ్చిమాసియాలో ఇరాన్‌తో చర్చలు జరపడం, అభివృద్ధి చెందిన దేశాల గళంగా, గ్లోబల్ సౌత్ నేతగా అవతరించేందుకు ప్రయత్నించడం ఇందులో ముఖ్యమైనవి. అంతేకాదు, రష్యాతో రక్షణ, ఇంధన రంగ సహకారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోమని భారత్ స్పష్టం చేసింది. పాశ్చాత్య కూటములతో చేతులు కలుపుతూనే, సంప్రదాయ మిత్రులను విస్మరించబోమనే వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని ప్రకటించింది. అదే సమయంలో, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీ సదస్సులో ఒక సున్నితమైన దౌత్య వ్యూహాన్ని అవలంబించారు. పశ్చిమ దేశాలను తిరస్కరించడం పూర్తిగా తమ వ్యూహం కాదని, ఆ దేశాలతో సంబంధాలు కొనసాగిస్తూనే అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను ఏకకాలంలో కాపాడుకోవాలన్నదే భారత్ వైఖరి అని ఆయన స్పష్టం చేశారు. అమెరికా ఒత్తిడి, చైనా ఆధిపత్యం మధ్య భారత్ తనను తాను ఒక ఆచరణాత్మక ప్రత్యామ్నాయంగా ప్రదర్శించుకోవడానికి ప్రయత్నించింది. అదే సమయంలో వాషింగ్టన్ ఎంత గట్టిగా ఒత్తిడి తెచ్చినా, దానిపై ఆధారపడకుండా యంత్రాంగాలను అభివృద్ధి చేయగలమని చెప్పగలగడమే ఈ బ్రిక్స్ సమావేశాల ప్రత్యేకత. చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ ఈ సదస్సులో చేసిన ప్రసంగం అత్యంత శక్తిమంతమైనది. 'నియమాలు లేని ప్రపంచం అంటే ట్రాఫిక్ సిగ్నల్స్ లేని కూడలి వంటిది. అంతర్జాతీయ నియమాలను అన్ని దేశాల భాగస్వామ్యంతోనే, అందరికీ ఒకే విధంగా ఉండేలా రూపొందించాలి. బలవంతుడిదే న్యాయం అనే సిద్ధాంతానికి అంతర్జాతీయ వ్యవహారాల్లో ఎలాంటి స్థానం ఉండకూడదు. ప్రపంచ దక్షిణ దేశాలు అంతర్జాతీయ వ్యవహారాల్లో చట్టబద్ధ పాలనను (రూల్ ఆఫ్ లా) సమష్టిగా పరిరక్షించాలి' అని జిన్ పింగ్ అన్నారు. బహుళ ధ్రువ ప్రపంచం అనే దాన్ని ఎవరూ మార్చలేరని, ప్రపంచాన్ని తమకోసం సుందరవనంగా, ఇతరులకు కీకారణ్యాలుగా మార్చేందుకు చేసే ప్రయత్నాలు చెల్లవని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. జారిపోతున్న తమ నాయకత్వాన్ని కాపాడుకోవడానికి పాత నేతలు కొందరు ఆంక్షలు, అడ్డంకులు సృష్టిస్తున్నారని, కానీ ఇవి ప్రత్యామ్నాయ, స్వతంత్ర వాణిజ్య మార్గాలను వేగవంతం చేస్తున్నాయని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగంలోనూ బలమైన వ్యాఖ్యలు లేకపోలేదు. 'మనం నిబంధనలను పాటించేవారిగా (రూల్-టేకర్స్) కాకుండా, నిబంధనలను నిర్దేశించేవారిగా (రూల్-షేపర్స్) ఎదగాల్సిన అవసరం ఉంది' అని మోదీ చెప్పారు. టెక్నాలజీని, కీలక ఖనిజాలను ఆయుధాలుగా వాడుకోవద్దని ఆయన హెచ్చరించారు. బ్రిక్స్ సదస్సులో అన్నిటికన్నా ముఖ్యమైనది ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ మధ్య దాదాపు 45 నిమిషాల పాటు ద్వైపాక్షిక సమావేశం. వ్యూహాత్మక భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ పరస్పర ఆర్థిక ప్రయోజనాలకోసం పనిచేసేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్న సంకేతాలు వెలువడ్డాయి. గల్వాన్ ఘర్షణల చేదు జ్ఞాపకాలను మరిచి, వాస్తవాధీన రేఖ వద్ద శాంతిని నెలకొల్పేందుకు, ఆర్థిక, దౌత్య మార్గాలను పునరుద్ధరించేందుకు భారత్ సుముఖత చూపింది. ఈ ఘట్టం ఏ పరిణామాల్ని సూచిస్తోంది? చైనాతో కొన్ని దశాబ్దాలుగా నెలకొన్న శత్రుత్వ వాతావరణం మారనుందా? భారత్--చైనా సంబంధాల పునరుద్ధరణ అనేది దౌత్యపరమైన విజయానికంటే వ్యూహాత్మక రాజీని సూచిస్తోందా? అని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది. రాజీ అనడం కన్నా ప్రస్తుత అల్లకల్లోల అంతర్జాతీయ వాతావరణంలో అదొక చారిత్రక అవసరం కూడా కావచ్చని మరికొందరు భావిస్తున్నారు. ఈ సమావేశంలో భారత్, చైనాల మధ్య అత్యంత ముఖ్యమైన ఏకాభిప్రాయం ఏర్పడిందని, వ్యూహాత్మక, దీర్ఘకాలిక, దిశానిర్దేశం చేసే అంశాలపై ఇరువురు నేతలు స్పష్టమైన, లోతైన చర్చలు జరిపారని చైనా విదేశాంగ మంత్రి, కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వాంగ్ యీ అనడం విస్మరించదగిన విషయం కాదు. బ్రిక్స్ సమావేశాలు మారుతున్న ప్రపంచ వ్యవస్థను, అంతర్జాతీయ సంబంధాల మార్పును సూచిస్తున్నాయని అమెరికన్ మీడియా వ్యాఖ్యానించింది. అమెరికాతో ఉద్రిక్తతలు ఉన్న ఇరాన్‌కు బ్రిక్స్‌లో ప్రముఖ స్థానం లభించడం గ్లోబల్ ఆర్డర్‌లో మారుతున్న సమీకరణాలకు అద్దం పడుతోందని అమెరికా పత్రికలు ప్రత్యేకంగా విశ్లేషించాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరించిన సుంకాల విధానాలే అంతర్గతంగా గణనీయమైన భేదాభిప్రాయాలు ఉన్న దేశాలను ఒకచోటకు చేర్చే అనుసంధానంగా (బైండింగ్ ఏజెంట్) పనిచేశాయని అమెరికన్ మీడియా భావించింది.

## బాల్యవివాహాల నిర్మూలనకు సహకరించాలి

**అంతర్జాతీయ బాల్య వివాహాల నిర్మూలన దినోత్సవం ప్రకటించడం గర్వకారణం. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**



సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా బాల్య వివాహాల నిర్మూలనకు రూరల్ డెవలప్మెంట్ సొసైటీ కృషి ప్రశంసనీయమని, వీరికి సంబంధిత అధికారులతో పాటు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బాల్యదశలో జరిగే మరియు బలవంతపు వివాహాల నిర్మూలన కోసం నవంబర్ 27న అంతర్జాతీయ దినోత్సవంగా పాటించాలని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ నిర్ణయించిన నేపథ్యంలో రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ముద్రించిన గోడ పత్రికలను బుధవారం కలెక్టరేట్లో సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025 నవంబర్ 27న భారతదేశంలో సుమారు 250 మిలియన్ల మంది పౌరులు బాల్య వివాహాల నిర్మూలనకు ఆర్డిఎస్ వ్యవస్థాపకుడు భువన్ రిభు సంకల్పంతో ప్రతిజ్ఞ చేయడం జరిగిందన్నారు. ఈ కారణంతో నవంబర్ 27 తేదీని బాల్యవివాహాల నిర్మూలన దినంగా ప్రతిపాదించగా ఐక్యరాజ్యసమితి ఆమోదించడం మనకెంతో గర్వకారణం అన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖతోపాటు జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు జిల్లాలో జరుగుతున్న బాల్యవివాహాలపై నిఘా ఉంచి, కట్టడి చేస్తున్నట్లు పేర్కొన్నారు. బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కలిగించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరపబోతున్నట్లు తెలిస్తే స్వచ్ఛంద సేవా సంస్థలు, యువత, ఇతర పౌరులు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ సునంద, ఆర్డిఎస్ అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్, జిల్లా కోఆర్డినేటర్ ఎడ్విన్, చంద్రశేఖర్, ధనలక్ష్మి, విద్యుల్లత, సాత్విక్, తదితరులున్నారు.

## 22ఏ భూముల సమస్య పరిష్కరించాలంటూ టీడీపీ ధర్నా




వేకువ సమయం సెప్టెంబర్ 16 కీసర ప్రతినిధి : మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ వద్ద టీడీపీ ఆధ్వర్యంలో 22ఏ నిషేధిత భూముల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

తెలంగాణ టీడీపీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కిని నరసింహులు, అరవింద్ కుమార్ గౌడ్, మల్కాజిగిరి పార్లమెంట్ కన్వీనర్ కందికంటి అశోక్ కుమార్ గౌడ్‌తో పాటు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 22ఏ చట్టం కింద నిషేధిత జాబితాలో చేర్చిన భూముల సమస్య సామాన్య ప్రజలకు శాపంగా మారిందని అన్నారు. ప్రభుత్వాలు, రెవెన్యూ యంత్రాంగం మారుతున్నా సమస్య పరిష్కారంలో జాప్యం కొనసాగుతోందని పేర్కొన్నారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములపై సమగ్ర పరిశీలన జరిపి, అర్హులైన భూ యజమానులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

కార్యక్రమంలో కాంటెస్టెంట్ కార్పొరేటర్ రుద్రగోని రాంచందర్ గౌడ్, జిల్లా అడహక్ సభ్యులు జంగారెడ్డి, కాంటెస్టెంట్ రామోజు శివకుమార్, జి. రాములు యాదవ్, కీసర వెంకటేష్ గౌడ్, సతీష్, రాగిరి సత్యనారాయణ గౌడ్, బింగి భిక్షపతి గౌడ్, టీ. ప్రకాష్, సురేష్ గుప్తా, రాజేష్, కీసర తంగళ్ళపల్లి శంకర్ తదితరులు.

## లక్ష్మీదేవిపల్లి, చటాన్‌పల్లి బ్రిడ్జి, సిద్ధాపూర్ డంపింగ్ యార్డుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

షాద్‌నగర్ : నియోజకవర్గంలో భారీగా డేటా సెంటర్ల ఏర్పాటు, వాటికి అవసరమైన భూసేకరణ, నీటి వనరులపై ప్రభుత్వం పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం షాద్‌నగర్‌లోని తన కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడాతూ..షాద్‌నగర్ నియోజకవర్గంలో పదుల సంఖ్యలో డేటా సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళికలు జరుగుతున్నాయనే సమాచారం తమ దృష్టికి వచ్చిందని విష్ణువర్ధన్ రెడ్డి ఆరోపించారు. ఇప్పటికే మూడు (3)డేటా సెంటర్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, మరో డేటా సెంటర్‌కు అనుమతులు సిద్ధమవుతున్నాయని పేర్కొన్నారు. డేటా సెంటర్లకు అవసరమైన భూములు, అనుమతులు తదితర అంశాలపై కొందరు వ్యక్తులు స్థానికంగా పరిశీలనలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ ఉద్దేశ్యంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. రిజర్వాయర్ తాగునీటి కోసమా...? సాగునీటి కోసమా...? ఇతర అవసరాల కోసమా అనే విషయాలను ప్రజలకు వెల్లడించాలని అన్నారు. రిజర్వాయర్ సామర్థ్యం, నీటి నిల్వ, తాగు-సాగునీటి వాటా వంటి వివరాలతో కూడిన డీపీఆర్ ను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని గతంలో చెప్పిన నేపథ్యంలో ప్రస్తుత ప్రణాళిక ఏమిటో ప్రభుత్వం వివరించాల్సిన అవసరం ఉందన్నారు.

**చటాన్‌పల్లి ఆర్వోబీ పనులపై స్పష్టత ఏదీ...?**

చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని విష్ణువర్ధన్ రెడ్డి కోరారు. గతంలో సుమారు రూ.90 కోట్లతో పనులు చేపడతామని చెప్పారని, అనంతరం రూ.190 కోట్లతో పనులు చేపడతామని 2024లో ప్రకటించినప్పటికీ పనులు ఇంకా ప్రారంభం కాలేదని విమర్శించారు.

త్వరలో MP గారి తో పూర్తి వివరాలు వెల్లడి చేస్తామనీ తెలిపారు..



## నా బ్యాంక్ ఖాతాలు అన్‌ఫ్రీజ్ చేయండి.. కోర్టులో ఐబొమ్మ రవి పిటిషన్

హైదరాబాద్, సెప్టెంబర్ 16: ఐబొమ్మ మాజీ నిర్వాహకుడు ఇమ్మంది రవి నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. ఫ్రీజ్ చేసిన తన డబ్బులను అన్‌ఫ్రీజ్ చేయాలని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఐబొమ్మ పైరసీ కేసులో అరెస్ట్ అయిన రవి.. ఆ తరువాత బెయిల్‌పై విడుదలైన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణలో భాగంగా రవికి సంబంధించిన బ్యాంకు అకౌంట్‌లు, ప్రాపర్టీ డిపాజిట్లను పోలీసులు సీజ్ చేశారు. ఈ క్రమంలో బ్యాంక్ అకౌంట్లు ఫ్రీజ్ చేయడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నట్లు రవి కోర్టుకు తెలియజేశారు. కుటుంబాన్ని పోషించుకోలేకపోతున్నానని.. తన అకౌంట్‌ల ద్వారా ఫ్రీజ్ చేసిన రూ.3 కోట్లను అన్‌ఫ్రీజ్ చేయాలని పిటిషన్‌లో రవి కోరారు. దీనిపై ఈరోజు నాంపల్లి 9వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు విచారణ చేపట్టనుంది. కాగా.. ఉన్నత చదువుల కోసం విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు వచ్చిన రవి.. ఆపై ఐబొమ్మ వెబ్‌సైట్‌లో పైరసీ సినిమాలు ప్రసారం చేస్తూ కోట్లు సంపాదించరనే ఆరోపణలు ఉన్నాయి. చాలా కాలంగా విదేశాల్లో ఉంటూ లగ్జరీ జీవితాన్ని గడిపారు. అంతేకాకుండా దమ్మంటే పట్టుకోండి అంటూ పోలీసులకే సవాల్ విసిరారు. ఈ విషయాన్ని సీరయస్‌గా తీసుకున్న పోలీసులు.. వ్యక్తిగత కారణలతో విదేశాల నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఐబొమ్మ రవి వెంటనే అరెస్ట్ చేసి విచారణ జరిపారు. దాదాపు మూడు నెలల పాటు జైలులో ఉన్న రవి.. బెయిల్‌పై విడుదలయ్యారు.

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ నేడు మహబూబ్‌నగర్‌కు

సమయం ప్రతినిధి మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 16: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆధ్వర్యంలోని కమిషన్ బృందం గురువారం (సెప్టెంబర్ 17) మహబూబ్‌నగర్ జిల్లాకు రానుంది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో పాటు సభ్యులు కుసుం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్ జిల్లాకు రానున్నారు. గురువారం ఉదయం 11 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కమిషన్ చైర్మన్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, డీసీఓ/ఆర్‌సీఓలు, ఎస్సీ, ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొననున్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలు, అట్రాసిటీ కేసులు, ఇతర అంశాలపై కమిషన్ అధికారులు సమీక్ష నిర్వహించనున్నారు

## 'మోదీజీ.. యూపీఐ పన్నును వెనక్కి తీసుకోండి': రాహుల్ గాంధీ

మొదటి పేజీ తరువాయి

యూపీఐ లావాదేవీలపై కొత్తగా తీసుకొచ్చిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ (MDR) విధానాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. దీనిని 'యూపీఐ పన్ను'గా అభివర్ణిస్తూ వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం అమెరికాకు ప్రయోజనం చేకూర్చేలా ఉందని, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడికి కేంద్ర ప్రభుత్వం తలొగ్గిందని ఆయన ఆరోపించారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ ఆరోపణలను ఖండించింది. MDR పన్ను కాదని, దాని భారాన్ని వినియోగదారులపై వేయబోమని స్పష్టం చేసింది. యూపీఐ లావాదేవీలపై కొత్తగా తీసుకొచ్చిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ (MDR) విధానాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. దీనిని 'యూపీఐ పన్ను'గా అభివర్ణిస్తూ వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం అమెరికాకు ప్రయోజనం చేకూర్చేలా ఉందని, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడికి కేంద్ర ప్రభుత్వం తలొగ్గిందని ఆయన ఆరోపించారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ ఆరోపణలను ఖండించింది. MDR పన్ను కాదని, దాని భారాన్ని వినియోగదారులపై వేయబోమని స్పష్టం చేసింది.

## నకిలీ అక్రిడిటేషన్ కార్డు తయారు చేసిన వ్యక్తి అరెస్ట్ సెల్‌ఫోన్ స్వాధీనం

నల్లబెల్లి : నల్లబెల్లి మండలం బిల్నాయక్ తండాకు చెందిన మూడు రవీందర్, మీ 24 న్యూస్ రిపోర్టర్‌గా చెప్పుకుంటున్న వ్యక్తి, నకిలీ అక్రిడిటేషన్ కార్డు తయారు చేసి, దానిని నిజమైనదిగా నమ్మించే ప్రయత్నం చేసిన కేసులో పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినారు. నిందితుడు వేరే మీడియా సంస్థకు సంబంధించిన అక్రిడిటేషన్ కార్డు ఫోటోను ఆధారంగా తీసుకొని, చాట్ జిపిటి సహాయంతో అందులోని పేరు, సంస్థ పేరు, కార్డు నంబర్, ఫోటో, సంతకం వంటి వివరాలను మార్చి, తన పేరు మూడు రవీందర్, , మీ 24 న్యూస్, కార్డు నెంబర్. డబ్ల్యు జి ఎల్ ఎం 173, వ్యాల్డిటి 30.04.2028 తదితర వివరాలతో నకిలీ అక్రిడిటేషన్ కార్డు తయారు చేసినట్లు విచారణలో వెల్లడైంది. అట్టి నకిలీ కార్డును వాట్సాప్ ద్వారా ఇతరులకు పంపించి, పోలీస్ అండ్ ప్రెస్ మీడియా నల్లబెల్లి వాట్సాప్ గ్రూపులో కూడా ప్రచారం చేయించినట్లు తెలిసింది. నిందితుడు నకిలీ అక్రిడిటేషన్ కార్డు తయారు చేయడానికి ఉపయోగించిన సాంసంగ్ స్మార్ట్‌ఫోన్ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నకిలీ అక్రిడిటేషన్ కార్డు తయారీ, దాని ప్రచారం, సంబంధిత డిజిటల్ ఆధారాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ రోజు నిందితుడు అయిన మూడు మూడు రవీందర్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.





# మక్తల్‌లో మండల స్థాయి బాలికల క్రీడా పోటీలు

మక్తల్: రాష్ట్ర మంత్రి డా. వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మక్తల్ పట్టణంలోని మినీ స్టేడియంలో బాలబాలికలకు మండల స్థాయి అండర్–14, అండర్–17 క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడా పోటీలను మక్తల్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి వాకిటి మానస ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారిణులను పరిచయం చేసుకుని, పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వాకిటి మానస గారు మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితంలో క్రీడలు ఎంతో ముఖ్యమైనవని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి చూపించి తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. ఈ మండల స్థాయి క్రీడా పోటీల్లో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, ఖాజా అమీరొద్దీన్ గారు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల PETలు, క్రీడా శిక్షకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు. క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు PETలు, కోచ్‌లు మరియు ఉపాధ్యాయుల కృషి మరువలేనిది అన్నారు.



# అమరచింత పిఎస్‌ఏని సందర్శించిన డిఎం & హెచ్వో





అమరచింత : అమరచింత PHC ని DMHO. భాస్కర్ నాయక్ . బుధవారం నాడు సందర్శించి హాస్పిటల్ ను పరిశీలించారు. ఆగష్టు 31న CPM ఆధ్వర్యంలో DMR హాస్పిటల్ ను PHC గా గుర్తించి 24గంటలు డాక్టర్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కార్యలయం ముందు ధర్నా నిర్వహించగా అప్పుడు MRO రవికుమార్ ఐవీసూ తో ఫోన్లో సంప్రదించగా బిజీగా ఉండడంతో వీలును చూసుకొని వస్తానని హామీ ఇచ్చిన హామీ మేరకు ఈరోజును హాస్పిటల్ ను సందర్శించడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివిస్ గోపి. సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు కో ఆప్షన్ సభ్యులుయస్. అజయ్ లు డిఎంహెచ్ఓ తో మాట్లాడుతూ అమరచింత డిఎంఆర్ హాస్పిటల్ PHC గా అప్ గ్రేడ్ అయినందున 24 గంటల పాటు వైద్యులు అందుబాటులో ఉండాలని కోరారు అదేవిధంగా అమరచింతకు ఏడుగురు వైద్యులను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినందున వారిని వెంటనే హాస్పిటల్ కు కేటాయించి విధులలో జాయిన్ చేసేందుకు త్వరగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనికి డిఎంహెచ్ఓ స్పందిస్తూ. అమరచింత హాస్పిటల్ పిఎస్సి గా ఎంపిక చేయబడిందని దానికి గాను తగిన డాక్టర్లు సిబ్బందిని త్వరలోనే ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఇటీవల మక్తల్ ఎమ్మెల్యే మంత్రి వాకిటి శ్రీహరి కూడా ఈ సమస్యపై నాతో మాట్లాడడం జరిగిందని త్వరలో అన్ని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# అమరచింతకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని RM కి వినతి



అమరచింత: తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ, మత్స్యశాఖ, క్రీడలు మరియు యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు, TG టాడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ సూచనల మేరకు,అమరచింత మున్సిపాలిటీ కేంద్రానికి వనపర్తి, గద్వాల, నారాయణపేట, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి బస్సు సర్వీసులు నడిపించాలని అమరచింత అఖిలపక్ష నాయకులు కలిసి మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి ఆర్‌ఎంతో ఫోన్‌లో మాట్లాడి, ప్రయాణికులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో అమరచింత మండల, పట్టణ నాయకులు ఆర్‌ఎంకి వినతి పత్రం అందజేశారు.వనపర్తి నుంచి వచ్చే ప్రతి బస్సును ఆత్మకూరు మీదుగా అమరచింత వరకు పొడిగించాలి. విద్యార్థుల సౌకర్యార్థం, చింతరెడ్డిపల్లి – నందిమల్ల – అమరచింత – ఆత్మకూరు మీదుగా వనపర్తి జిల్లా కేంద్రానికి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలి. నారాయణపేట నుంచి గతంలో నడిచిన మరికల్ – అమరచింత బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి. మహబూబ్‌నగర్ నుంచి అమరచింతకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేసి, గతంలో ఉన్న విధంగా రాత్రి 8 గంటలకు చివరి బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలి. మహబూబ్‌నగర్ నుంచి ఆత్మకూరు మీదుగా జూరాలకు వెళ్లే బస్సులు అమరచింత మీదుగా జూరాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారి లో అమరచింత కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జి. రాజేందర్ రెడ్డి అమరచింత కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు టి. రవికాంత్ అమరచింత మున్సిపాలిటీ చైర్‌పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్ అమరచింత మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ ఎస్. రాధ అరుణ్ కుమార్ ఉన్నారు.

## కొత్తకోట మున్సిపల్ కాంప్లెక్స్‌లో పోలీసు షాప్ నెం.6కు ఓపెన్ టెండర్ జిల్లా ఎస్పీ

### ఈ నెల 28న బహిరంగ టెండర్ నిర్వహణ
### షాప్‌ను అద్దెకు తీసుకునేందుకు ఆసక్తిగల వ్యాపారులకు అవకాశం

కొత్తకోట సెప్టెంబర్ –16: కొత్తకోట మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా ఎక్స్‌రోడ్డులోని మున్సిపల్ కాంప్లెక్స్ భవనంలోని పోలీసుశాఖకు సంబంధించిన షాప్ నంబర్–6ను అద్దెకు కేటాయించేందుకు ఈ నెల 28–09–2026 సోమవారం రోజు వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్ లో ఉదయం 11 గంటలకు ఓపెన్ టెండర్ నిర్వహించనున్నట్లు వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యాపారులు ఓపెన్ టెండర్‌లో పాల్గొని షాప్‌ను అద్దెకు పొందేందుకు అవకాశం ఉందని ఎస్పీ పేర్కొన్నారు. టెండర్‌కు సంబంధించిన నిబంధనలు, రిజర్వ్ ధర తదితర పూర్తి వివరాల కోసం రిజర్వ్ ఇన్‌స్పెక్టర్, (RI-MTO) వనపర్తి శ్రీనివాస్‌ని సంప్రదించాలని సూచించారు.

## UPI చెల్లింపులపై టాక్స్ వేసే యత్నం ను నిరశిస్తూ నేడు, రేపు, నిరసనలు :. Cpiml మాస్ లైన్

హైదరాబాద్ : బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అని తెచ్చిన GST, UPI చెల్లింపుల మీద పన్ను వేసి, ప్రజల పై భారం వేసిన, వేస్తున్న విధానాన్ని Cpiml మాస్ లైన్ తీవ్రంగా ఖండిస్తున్నది. GST పేరుతో ఇప్పటికే ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారు. నేడు సాధారణ ప్రజలనందరిని upi చెల్లింపులకు అలవాటు చేసి నేడు టాక్స్ వేసే యత్నం అత్యంత మోసపూరిత చర్య. అమెరికా, వీసా, మాస్టర్ కార్డ్‌ల వత్తిడి మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ చర్యకు ఉపక్రమించింది. తమ లావాదేవీలకు ఇవి నష్టం తెస్తున్నాయని అమెరికా ఆగ్రహిస్తున్నది. దాని ప్రభావంతో మోడీ ప్రభుత్వం ఈ చర్యకు ఉపక్రమించింది. ఇది ప్రజావ్యతిరేక చర్య. కేంద్ర ప్రభుత్వం ప్రజల పై భారం వేసే విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 17,18 తేదీలలో ఎక్కడికక్కడ నిరసనలు తెలపాలని ప్రజలను కోరుతున్నామని తెలిపారు.

## చిన్న వినాయకుల నిమజ్జనానికి ప్రత్యేక పాండ్లు



జడ్చర్ల సెప్టెంబర్ 16: సమయం ప్రతినిధి : వినాయక చవితి సందర్భంగా జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో చిన్న వినాయక విగ్రహాల నిమజ్జనానికి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలో, హౌసింగ్ బోర్డు–బీసీ హాస్టల్ వెనుక కల్వకుర్తి రోడ్డులోని పార్కు వద్ద తాత్కాలిక నిమజ్జన పాండ్లను ఏర్పాటు చేశారు.

**భక్తులకు ఇబ్బందులు లేకుండా..** చిన్న విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు వీలుగా ఏర్పాటు చేసిన పాండ్లను మున్సిపల్ కమిషనర్ గిరీష్ ప్రారంభించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిమజ్జన ప్రక్రియ సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టీపీవో లక్ష్మీపతి, మేనేజర్ లక్ష్మన్న, ఏఈ గాయత్రి, ఆర్ఓ సలాం, ఆర్ఐ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# బొమ్మలరామారం కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలకు భారీ షాక్

**ఆ పార్టీలకు చెందిన మండల ముఖ్య నాయకులు టీఆర్పీలో చేరిక**
**మల్యాల గ్రామ శాఖ కాంగ్రెస్ నాయకుడు బిట్టు శ్రీనివాస్ తన అనుచరులుతో మల్లన్న సమక్షంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరిక**

నల్గొండ : ఆలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీలకు చెందిన బొమ్మలరామారం మండల ముఖ్య నాయకులు ఆయా పార్టీలకు రాజీనామా చేసి తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు.యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కొమిరిశెట్టి నరసింహులు, బొమ్మలరామారం మండల అధ్యక్షులు బూడిద శ్రీనాథ్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వారికి పార్టీ కండువా కప్పి తెలంగాణ రాజ్యాధికార పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ, తెలంగాణలో ప్రజలు రాజకీయ మార్పును కోరుకుంటున్నారని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ పనిచేస్తుందని అన్నారు. పార్టీలో చేరిన నాయకులు ప్రజల సమస్యలపై నిరంతరం పనిచేయాలని సూచించారు. బొమ్మలరామారం మండలంతో పాటు ఆలేరు నియోజకవర్గంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరిన నాయకులు తమ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారం కోసం కృషి చేయాలని మల్లన్న సూచించారు. కొత్తగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మల్యాల గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ బిట్టుతో పాటు ఆయన అనుచరులు గణేష్, స్వామి, వెంకటేశం, ఆంజనేయులు, శ్రీనివాస్ తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు.అలాగే మాంచినపల్లి, కేకే తండా, రామస్వామి తండాలకు చెందిన భానుచందర్, హరి మోహన్ నాయక్, శ్రీకాంత్ నాయక్, రమేష్ నాయక్, సిద్దు నాయక్, పాండు నాయక్, సురేందర్ నాయక్, సక్రు నాయక్, శ్రీకాంత్ నాయక్ తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మాజీ జడ్పీటీసీ వైస్ చైర్మన్ ధనవత్ బీకు నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లోజన్ నాయక్,



మండల కార్యదర్శి బాలశేఖర్, ఎస్టీ సెల్ నాయకులు మూడవత్ సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఓపికగా.. క్రమపద్ధతిలో నిమజ్జనం చేయండి!





షాద్‌నగర్ : వినాయక నిమజ్జన వేడుకలకు బొబ్బిలి చెరువు ముస్తాబైంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. షాద్‌నగర్ పట్టణంలోని బొబ్బిలి చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను షాద్‌నగర్ డీసీపీ శిరీష స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డిసిపి శిరీష మాట్లాడుతూ నిమజ్జన వేడుకల్లో భక్తులందరూ శాంతియుతంగా, ఓపికతో వ్యవహరించాలని డీసీపీ శిరీష కోరారు. ఒకేసారి తొందరపడకుండా ఒకరి తర్వాత ఒకరు క్రమపద్ధతిలో నిమజ్జనం నిర్వహించాలని సూచించారు. పోలీసుల సూచనలను పాటిస్తూ భక్తులు సహకరిస్తే నిమజ్జన కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా సాగుతుందని తెలిపారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ నిమజ్జన ప్రాంతంలో అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు డీసీపీ పేర్కొన్నారు. దైవభక్తితో.. క్రమశిక్షణతో.. గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలకాలని ఆమె కోరారు.

**భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు..**
**బొబ్బిలి చెరువు వద్ద డీసీపీ శిరీష, ఏసీపీ మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు రాజు నాయక్, పెంటయ్య తదితరులు పరిశీలన**

**తొందర వద్దు.. సహకారం ముందు!**
**ఏసీపీ లక్ష్మీనారాయణ**

భక్తులు సంయమనం పాటించాలని .. షాద్ నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ కోరారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులకు తావులేకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఏసీపీ లక్ష్మీనారాయణ కోరారు. భక్తులు ఓపికగా వ్యవహరిస్తూ క్రమపద్ధతిలో నిమజ్జనం పూర్తి చేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతంలో భద్రత, రాకపోకలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు.గణనాథుడి నిమజ్జనం భక్తులకు అసౌకర్యం లేకుండాముని్సపాలిటీ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్

**మున్సిపల్ ఏర్పాట్లు పూర్తి.. చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్**

నిమజ్జనానికి వచ్చే భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పించేలా మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్లు షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ తెలిపారు. బొబ్బిలి చెరువు ప్రాంతాన్ని పరిశీలించి అవసరమైన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. భక్తులు ప్రశాంతంగా నిమజ్జన వేడుకల్లో పాల్గొనాలని కోరారు.
"ఓపికగా సాగిద్దాం.. ఆనందంగా వీడ్కోలు పలుకుదాం!

**అందరి సహకారంతో నిమజ్జనం విజయవంతం..**
**వైస్ చైర్మన్ అందే మోహన్**

వినాయక నిమజ్జన వేడుకలను ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ అందే మోహన్ కోరారు. భక్తులు తొందరపడకుండా ఒకరి తర్వాత ఒకరు నిమజ్జనం చేసుకోవాలని సూచించారు. భక్తుల సౌకర్యం కోసం చేపట్టిన ఏర్పాట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**మన గణనాథుడికి.. ఘనంగా వీడ్కోలు ..!**
**6 వ వార్డ్ కౌన్సిలర్ రాజు నాయక్**

శాంతి, భక్తితో వేడుకలు జరుపుకుందాం.. కౌన్సిలర్ రాజు నాయక్ బొబ్బిలి చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన 6వ వార్డు కౌన్సిలర్ రాజు నాయక్ అన్నారు. భక్తులు శాంతియుత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. పోలీసు, మున్సిపల్ సిబ్బందికి సహకరిస్తూ క్రమపద్ధతిలో ముందుకు సాగాలని సూచించారు.

**అధికారుల సమన్వయ పరిశీలన**

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలనలో డీసీపీ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ సీతారాం, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, 6వ వార్డు కౌన్సిలర్ రాజు నాయక్, 25 వ వార్డ్ కౌన్సిలర్ పెంటయ్య, ఏఈ సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ కార్యాలయాలకు సొంత భవనాలు మంజూరు చేయాలి

### కొత్త మండలాల్లో మౌలిక వసతులు కల్పించాలి: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



హైదరాబాద్: 22-ఏ నిషేధిత భూముల అంశంపై అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ రెవెన్యూ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త మండలాలను ఏర్పాటు చేసినప్పటికీ, అనేక మండలాల్లో ఇప్పటికీ రెవెన్యూ కార్యాలయాలకు సొంత భవనాలు లేక అధికారులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే గారు తెలిపారు. కొత్తగా ఏర్పడిన మండలాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేకంగా జిల్లేడు చౌదరిగూడ మండలంలో తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అక్కడ తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవనం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫరూఖ్ నగర్ తహశీల్దార్ కార్యాలయ భవనం కూడా శిథిలావస్థకు చేరిందని నూతన భవనం మంజూరు చేయాలని కోరారు. అలాగే లింగారెడ్డిగూడ గ్రామంలో సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన భవనంలో కొనసాగుతున్న రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) కార్యాలయానికి కూడా సొంత భవనం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.షాద్ నగర్ నియోజక వర్గం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద ఎత్తున రెవెన్యూ వస్తుందని తెలిపారు. ఇప్పటికే నందిగామ తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు.

## తెలంగాణలోని కుటుంబాలకు మరింత సురక్షితమైన భవిష్యత్తు దిశగా ఒక కీలక ముందడుగు!

హైదరాబాద్ : తెలంగాణకు అదనంగా 1.21 లక్షల ఇళ్లను మంజూరు చేయడం ద్వారా, ఇప్పటికే ఉన్న 79,000 ఇళ్ల కేటాయింపు పరిమితిని దాటి మొత్తం 2 లక్షల PMAY-G ఇళ్లను ఆమోదించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి పాలమూరు పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి అరుణ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం కేవలం తలదాచుకోవడానికి ఒక గృహాన్ని కల్పించడానికే పరిమితం కాదు; ఇది గౌరవం, భద్రత, స్థిరత్వం మరియు 2 లక్షల కుటుంబాలు తమ భవిష్యత్తును మెరుగుపరుచుకునే అవకాశాన్ని కల్పించడం గురించినది. ఒక ఇల్లు అనేది కుటుంబం యొక్క కలలకు పునాది వంటిది ఈ మంజూరు ఆ కలలను సాకారం చేసే దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యులు శ్రీమతి డీకే అరుణమ్మ అభివర్ణించారు.




## రాంపల్లిలో రూ.5 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



వేకువ సమయం సెప్టెంబర్ 16 కీసర ప్రతినిధి : కీసర మండలం నాగారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాంపల్లిలో పలు కాలనీల్లో రూ.5 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకుడు కౌకుట్ల జీవన్ రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, నాగారం డివిజన్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు డ్రైనేజీ, మౌలిక వసతులకు సంబంధించిన పలు సమస్యలను వజ్రేష్ యాదవ్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి జరగడం లేదని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ.. నియోజకవర్గంలో 1000 రోజుల పాలనలో భాగంగా రూ.300 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వజ్రేష్ యాదవ్ తెలిపారు. జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రజలకు కనిపించడం లేదా అని అయన ప్రశ్నించారు.

## రాష్ట్ర ప్రభుత్వ కార్మికుల పై నిర్బంధని వ్యతిరేకిస్తూ CITU సామూహిక నిరసన దీక్ష





వనపర్తి : CITU వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పాలిటెక్నిక్ కాలేజీ ముందర సామూహిక నిరసన దీక్ష చేపట్టారు.ఈ దీక్షలను రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు CITU ఆధ్వర్యంలో కార్మిక వర్గం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోలీస్ నిర్బంధ ఖండని వ్యతిరేకిస్తూ వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కాలేజ్ ముందర రోడ్డుపైన నిరసన దీక్షను చేపట్టడం జరిగింది ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కార్మిక వర్గానికి అనేక హామీలు ఇచ్చి అమలు చేస్తామని తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచింది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు గడిచినప్పటికీ, కార్మిక వర్గానికి ఇచ్చిన హామీల అమలు పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నది. దీనితో కార్మిక వర్గం తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన - పోరాటాలు చేస్తుంటే రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తో పాటు వివిధ జిల్లాల్లో తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో కనీసం ధర్నా చేసుకునేందుకు కూడా అనుమతిని నిరాకరిస్తున్నారు. ఇది కార్మికుల హక్కులను అప్రాజాస్వామికంగా నిరాకరించటమేనని, ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని విమర్శించారు. 2026 సెప్టెంబర్ 8,9తేదీల్లో జరిగిన అంగన్వాడీ,ఆశా రెండు సంఘాల "ఛలో హైదరాబాద్" పిలుపులను భగ్నం చేయడానికి కాంగ్రెస్ సర్కార్ పడరాని పాట్లు పడింది. వివిధ జిల్లాల్లో నాయకులను ఇండ్ల వద్దే ముందు రోజు రాత్రే అరెస్టులు చేశారు. సిఐటియు రాష్ట్ర నాయకులను సైతం తెల్లవారిఝాము నుండే వేటాడారు. వందలాది మంది పోలీసులు తమ బలగాలతో వచ్చి అక్రమ ముందస్తు అరెస్టుకు పాల్పడుతున్నారు. పోలీసుల చర్యల మూలంగా ప్రజాస్వామ్యంలో చట్టబద్ధంగా పనిచేస్తున్న సిఐటియు నాయకులను సంఘ వ్యతిరేక శక్తులుగా చిత్రీకరించడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయలేదు. మహిళలకు ఉచిత బస్సు, గృహజ్యోతి పథకం మినహా ఏ ఒక్క గ్యారంటీని అమలు చేయలేదు. ఆశా వర్కర్స్ రూ.18,000/-ల ఫిక్స్ వేతనం, పిఎఫ్ సౌకర్యం అమలు,గ్రామ పంచాయితీ, మున్సిపల్,=ఇజ విద్యుత్, ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్, బిల్డింగ్, హమాలీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు డిమాండ్ చేస్తున్నాము.వీటి ఎజెండా కోసం ఆందోళన- పోరాటాలు చేస్తున్నారు. బాధ్యత కల్గిన రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సమస్యలను పరిష్కరించాలి.పరిష్కరించకుండా ఆందోళనా-పోరాటాలు నిర్వహిస్తున్న కార్మికులను అణచివేస్తూ తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు.ఈ సామూహిక దీక్ష ద్వారా కార్మిక ఉద్యమాలు అణిచితే నీకు కూడా కెసిఆర్ గతే పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సిఐటియు సీనియర్ నాయకులు పుట్ట ఆంజనేయులు సామూహిక నిరసన దీక్షకు మద్దతు తెలుపుతూ మాట్లాడడం జరిగింది. సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు R N రమేష్, మండ్ల రాజు, జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్, జిల్లా ఉపాధ్యక్షులు సునీత, బాల గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ రాజు సూర్యవంశం రాము బుచ్చమ్మ, కవిత, CITU జిల్లా నాయకులు గిరిజ, తిరుపతమ్మ, సుమతి, ఇందిరా, అరుణ, హరికృష్ణ, శ్రీనివాస్, హనీప్, జయమ్మ, మంజుల, నారాయణ, ఆశ, అంగన్వాడి, మున్సిపల్ కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు, హమాలీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ట్రాన్స్పోర్ట్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించాలి

## సెప్టెంబరు 17న ప్రభుత్వమే విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలి: బీజేపీ

వేకువ సమయం సెప్టెంబర్ 16 కీసర ప్రతినిధి : కీసర తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించాలి కీసర సెప్టెంబరు 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా ప్రకటించి, ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ కీసర డివిజన్ అధ్యక్షుడు కోల బాలరాజు ఆధ్వర్యంలో కీసర తహశీల్దార్ యాదగిరిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. సెప్టెంబరు 17 తెలంగాణ చరిత్రలో ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన రోజని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేసే విధంగా ఈ రోజును అధికారికంగా గుర్తించి, ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం ద్వారా పోరాటంలో పాల్గొన్న వారి త్యాగాలను స్మరించుకోవడంతో పాటు చారిత్రక అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించవచ్చున్నారు. ప్రభుత్వం సెప్టెంబరు 17న అధికారిక కార్యక్రమాలు నిర్వహించి, తెలంగాణ చరిత్రను ప్రతిబింబించేలా వేడుకలు నిర్వహించాలని వారు కోరారు. ఈ అంశంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కౌకుట్ల చంద్రారెడ్డి, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బుద్ధవరం లక్ష్మి, గోనే శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బోడ శ్రీనివాస్, శ్యాంసుందర్ శర్మ, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్, మాజీ అధ్యక్షుడు దేశం మల్లేష్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మెట్టు క్రిష్ణ యాదవ్, జిల్లా నాయకులు రాగుల అశోక్ ముదిరాజ్, ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి కొలిచెలిమి క్రిష్ణ, ఏలూరి సత్యనారాయణ, నాగారం డివిజన్ అధ్యక్షుడు నాగరాజు, కీసర డివిజన్ ప్రధాన కార్యదర్శి నల్ల వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, జంగారెడ్డి, అన్నోజిగూడ మల్లారెడ్డి,తాళ్ల మల్లేష్, తర్రేక్రిష్ణ, బోయిని రాంబాబు, భాస్కర్ ముదిరాజ్ ,లింగం ముదిరాజ్ , నాగరాజు,జిన్నారం వేణు తదితరులు పాల్గొన్నారు.



# ఆధ్యాత్మిక శోభతో పోలీసు సురక్ష గణనాథుని నిమజ్జనం:ఎస్పీ





**సంప్రదాయబద్ధంగా పోలీసు సురక్ష గణపయ్య లడ్డూ వేలం పాట**
**భజనలు, బాజాభజంత్రీలతో ఆధ్యాత్మిక శోభతో నిమజ్జనం**
**భక్తి సంస్కృతి, సంప్రదాయాల నడుమ పోలీసు సురక్ష గణనాథునికి ఘన వీడ్కోలు**
**శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించడంలో పోలీసుల సమన్వయం అభినందనీయం ఎస్పీ**

వనపర్తి, సెప్టెంబర్ 16: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వనపర్తి జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలోని సాయుధ దళ పోలీసు కార్యాలయంలో ప్రతిష్ఠించిన మట్టి గణనాథుని నిమజ్జన కార్యక్రమాన్ని భక్తి, సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనంగా ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కొలువుదీరిన పోలీసు సురక్ష గణనాథునికి బుధవారం జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సంప్రదాయ పద్ధతిలో గణనాథునికి పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో సమర్పించిన లడ్డూను వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని పెద్ద లడ్డు 61 వేలకు చిన్న లడ్డు 21 వేలకు సొంతం చేసుకుని భక్తి భావాన్ని చాటుకున్నారు. అనంతరం భజనలు, బాజాభజంత్రీలు, కోలాటాలు, జై గణేశ్ నినాదాల నడుమ గణనాథుని ఊరేగింపును ఆధ్యాత్మికంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్పీ నిమజ్జనంలో పాల్గొని గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.. విఘ్నాలను తొలగించే గణనాథుని ఆశీస్సులతో వనపర్తి జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభ్రాతృత్వాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నాను. వినాయక నవరాత్రి ఉత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలకు ప్రతీకలు. భక్తితో పాటు బాధ్యత, క్రమశిక్షణ, పరస్పర సహకారం కలిగి ఉత్సవాలను నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రజల భక్తి భావాలను గౌరవిస్తూ, ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీసుశాఖ నిరంతరం కృషి చేస్తుంది. ప్రజలు కూడా పోలీసుశాఖకు సహకరిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలి. ప్రజల భద్రత, శాంతి, సౌభ్రాతృత్వమే పోలీసుశాఖకు అత్యంత ప్రాధాన్యతని భక్తి, సంప్రదాయం, పోలీసు ఐక్యతకు ప్రతీకగా . సంప్రదాయ కళారూపాలు, భక్తి గీతాలు, కోలాటాలతో ఆహ్లాదకరమైన ఆధ్యాత్మిక వాతావరణంలో గణనాథుని నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ గిరిబాబు, జిల్లా పోలీసు కార్యాలయం ఏ ఓ, సునంద, వనపర్తి సీఐ, సుగంధరత్నం, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, అప్పలనాయుడు, శ్రీనివాస్,స్పెషల్ బ్రాంచ్ ఎస్సైలు మంజునాథ్ రెడ్డి, పర్వతాలు, నరేష్, వనపర్తి పట్టణ ఎస్సై హరిప్రసాద్, వనపర్తి రూరల్ ఎస్సై, హృషికేష్, అమరచింత ఎస్సై, స్వాతి, రేవల్లి ఎస్సై, రజిత శ్రీరంగాపూర్ ఎస్సై,హిమబిందు,రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్లు వినోద్, మగ్దూం బారీ, ట్రాఫిక్ ఎస్సై సురేందర్, పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీసు ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంలో వరసిద్ధి వినాయక స్వామికి ప్రత్యేక పూజలు





**ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు నిర్వహించిన మేయర్**

మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంలో ప్రతిష్ఠించిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారికి బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి కుమార్తె మారేపల్లి మహతీ రెడ్డి మేయర్‌తో కలిసి ఆత్మీయ అతిథిగా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాల తో జీవించాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని, విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరికీ శుభం కలగాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, నిజలింగప్ప, అనిల్తో పాటు శిక్షణ కేంద్ర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ఎస్సీ సర్టిఫికెట్ల బాగోతం - కలెక్టర్ కు ఫిర్యాదు
## విచారణకు ఆదేశించాలని కాడే పాగు అశోక్ వినతి



వనపర్తి జిల్లా ఆత్మకూరు, అమరచింత, ఖానాపూర్ ప్రాంతాల్లో బీసీ–బి కులానికి చెందిన కురువలు నకిలీ ఎస్సీ సర్టిఫికెట్లు సృష్టించి దళితుల రిజర్వేషన్లను కొల్లగొడుతున్నారని, వారిపై విచారణ చేపట్టాలని దళిత సీనియర్ జర్నలిస్ట్ కాడే పాగు అశోక్ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ ప్రాంతంలో మాదాసి కురువలు లేరని గతంలోనే కలెక్టర్ నివేదిక ఇచ్చారని, ఇప్పుడు అక్రమంగా సర్టిఫికెట్లు పొంది ఉద్యోగాలు, ఎంబీబీఎస్ సీట్లు పొందుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆత్మకూరు వైభవ్ షాపు యజమాని బెన్న వెంకట సుధీర్ పిల్లలు ఇద్దరు నకిలీ పత్రాలతో ఎంబీబీఎస్ సీట్లు పొందారని ఫిర్యాదులో ఉంది. కొడుకు బి.మణికంఠ ఉస్మానియా మెడికల్ కాలేజీలో 2018–19లో సీటు పొంది ప్రస్తుతం ప్రాక్టీస్ చేస్తున్నాడు. కూతురు బెన్న రమ్య (రోల్ నెం: 4201103866, ర్యాంక్ 92328) 2020–21లో మహబూబ్ నగర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు పొందింది. అలాగే రాగే దైవదీనం కూతురు రాగే సాహితి (రోల్ నెం: 4208030393) 2024–25లో మహేశ్వరం వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ లో చేరిందని పేర్కొన్నారు. అమరచింత: ఖానాపూర్ గ్రామానికి చెందిన కోట్ల తిరుపతయ్య కుటుంబం బోగస్ సర్టిఫికెట్లతో నలుగురికి వీదీదూ సీట్లు ఇప్పించుకుందని ఆరోపణ. తిరుపతయ్య కూతురు పుష్ప పంచాయతీ సెక్రటరీగా, కొడుకు వంశీ పంచాయతీరాజ్ AE గా జూరాల ప్రాజెక్టులో పనిచేస్తున్నారు. వీరి బంధువులైన హర్షిత D/o GK రాములు, ప్రవీణ్ S/o కోట్ల సతీష్, స్రవంతి D/o కుర్వ బోలెమసన్న, సాయి వర్షిత D/o GB శ్రీనివాసులు నలుగురూ మాదిగ సర్టిఫికెట్ పై MBBS సీట్లు పొందారని ఫిర్యాదులో ఉంది.

## మూడవ రోజు ఘనంగా
## శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి ప్రత్యేక పూజలు

**ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన నగర మేయర్**



మహబూబ్‌నగర్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రతిష్టించిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారికి మూడవ రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం



**చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు గుర్తించాలి**
**సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్**

షాద్‌నగర్: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సీపీఎం షాద్‌నగర్ కమిటీ ఆధ్వర్యంలో, పట్టణ కార్యదర్శి శ్రీను నాయక్ అధ్యక్షతన "తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం – వక్రీకరణ, వాస్తవాలు" అనే అంశంపై షాద్‌నగర్ పట్టణంలోని పెన్షనర్ కార్యాలయంలో సెమినార్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ కాడిగళ్ల భాస్కర్ పాల్గొని మాట్లాడుతూ, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, గ్రామాల్లో భూస్వాముల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భారత చరిత్రలో ఒక ముఖ్యమైన రైతాంగ ఉద్యమంగా నిలిచిందన్నారు. "దున్నేవాడికే భూమి దక్కాలి" అనే నినాదంతో రైతులు, వ్యవసాయ కూలీలు భూస్వాముల దోపిడీ, వెట్టి చాకిరీ, అక్రమ వసూళ్లు, భూముల నుంచి బహిష్కరణలకు వ్యతిరేకంగా పోరాటం సాగించారని తెలిపారు. ఈ పోరాటం క్రమంగా నిజాం పాలన, రజాకార్ల అణచివేతకు వ్యతిరేకంగా సాయుధ ప్రతిఘటనగా విస్తరించిందన్నారు. ఈ ఉద్యమం గరిష్ఠ దశలో సుమారు 3,000 గ్రామాలను ప్రభావితం చేసిందని తెలిపారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీకి చెందిన అనేక మంది కార్యకర్తలు, రైతులు ప్రాణత్యాగం చేశారని భాస్కర్ పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సుమారు 4,000 మంది కమ్యూనిస్టులు, రైతు కార్యకర్తలు ప్రాణాలను కోల్పోయిన చరిత్ర ఉందని తెలిపారు. పోరాటం సాగిన ప్రాంతాల్లో గ్రామ రాజ్యాలు ఏర్పడి ప్రజల ఆధ్వర్యంలో స్థానిక పరిపాలన కొనసాగిందన్నారు. అలాగే సుమారు 10 లక్షల ఎకరాల భూమి పేదలు, భూమిలేని రైతులకు పంపిణీ జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ఎం రాజు మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 13 నుంచి 17 వరకు జరిగిన ఆపరేషన్ పోలో అనంతరం హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం అయిందన్నారు. అయితే తెలంగాణలో కమ్యూనిస్టుల సాయుధ పోరాటం వెంటనే ముగియలేదని, అది 1951 వరకు కొనసాగిందని, కమ్యూనిస్టు పార్టీ నిర్ణయం అనంతరం 1951 అక్టోబర్‌లో సాయుధ పోరాటం విరమించబడిందని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరించే ప్రయత్నాలు చేస్తోందని వారు విమర్శించారు. చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు గుర్తించాలని, తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వాస్తవ ఆధారాలతో ప్రజలకు, ముఖ్యంగా యువతకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఈశ్వర్ నాయక్, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు ఏ. కుర్మయ్య, వెంకటరమణ, మహమ్మద్ బాబు, కావలి రాజు, లక్ష్మి, పార్వతమ్మ, శ్రీలత, లక్ష్మి, బాలరాజు, రాజు, కే. రాములు, హెచ్. రాములు, పాండు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎస్ఎఫ్ఐ నాయకులు ఆదిల్, శివ, సాయి, యశ్వంత్, విష్ణు, జానవి, చరిత్ర, చైతన్య, సన తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామలింగేశ్వర కాలనీలో గణేష్ నవరాత్రోత్సవాలు



వేకువ సమయం సెప్టెంబర్ 16 కీసర ప్రతినిధి : కీసర: శ్రీరామలింగేశ్వర కాలనీలో గణేష్ నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగు తున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలకు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై గణేశుడిని దర్శించుకున్నారు. వేద మంత్రోచ్చా రణలు, ప్రత్యేక పూజలతో కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామిడి విజయ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మచ్చాని జంగయ్య యాదవ్ పాల్గొని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులు, కాలనీ వాసులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నవరాత్రోత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. గణేశుడి ఆశీస్సులతో కాలనీ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు వేడు కున్నారు. ఉత్సవాల్లో కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నారు.

వేకువ సమయం
గురువారం 17 సెప్టెంబర్ 2026

# ఎస్ఐఆర్ కార్యక్రమం విస్తృతంగా సాగుతుంది

**మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 16(వేకువ సమయం ప్రతినిధి):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా పారదర్శకంగా ఓటరు జాబితా తయారు చేయుటకు జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, ఎన్నికల విభాగం సిబ్బందితో కలిసి జిల్లాలో నీ గ్రామపంచాయతీ, వార్డులు, మున్సిపల్ పరిధిలలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఇప్పటికే ముఖ్య ఎన్నికల అధికారి తెలిపిన షెడ్యూలు ప్రకారం ఎన్నికల విధులు నిర్వహించడం జరిగిందని, ప్రస్తుతం సుమారు 88 వేల 8 వందల మందికి నోటీసులు అందించడం జరిగిందన్నారు, వారికి సూచించబడిన గుర్తింపు కార్డులను తీసుకొని వచ్చి సంబంధిత పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న బూతు లెవల్ అధికారులను సంప్రదించి తమ ఓటును భద్రపరుచుకోవాలని విస్తృత ప్రచారం కల్పించడం జరుగుతుందని, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా తమ బి ఎల్ ఏ ల ద్వారా ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించి పారదర్శకమైన ఓటరు జాబితా తయారు చేయుటలో తమ వంతు భాగస్వామ్యం ఉండాలని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు భద్రపరుచుటకు కోసం ఎన్నికల సంఘం ఇప్పటికే చాలాసార్లు ప్రజలకు అవకాశం కల్పించిందని,ఇప్పుడు కూడా ఇంకా సమయం ఉందని, నోటీసులు అందుకున్న ఓటర్లు తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.నిబంధనలకు విరుద్ధంగా ఎవరి ఓటును తొలగించడం జరగదని, చనిపోయిన, షిఫ్టింగ్ అయినా, డబుల్ ఓటర్లు, మార్పులు, చేర్పులు కొత్తగా ఓటరు నమోదు కోసం సంబంధిత బూతు లెవల్ అధికారులను సంప్రదించి దరఖాస్తులు ఫామ్ లు పూర్తి చేసి అందించాలని సూచించారు.వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలను సూచనలను విన్న ఆమె మాట్లాడుతూ బూతు లెవల్ అధికారులకు రెమినేషన్ కు సంబంధించి వెంటనే చర్యలు తీసుకోవడం జరిగిందని, త్వరలో వారికి సాలరీస్ అందించడం జరుగుతుందని తెలిపారు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్, ఓటరు జాబితా, తదితర అంశాల కోసం ఎన్నికల సంఘం వెబ్సైట్ లో ఎలాంటి సందేహాలు సమాచారం కావాలన్నా తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నుండి సురేష్ నాయుడు, బిఆర్ఎస్ పార్టీ మార్నేని వెంకన్న, బిజెపి శ్యాం సుందర్ శర్మ, టిడిపి పిబి.రామారావు, బీఎస్పీ పార్టీ ఎల్. విజయ్ కాంత్, సిపిఐ పార్టీ విజయ్ సారథి, మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, ఎలక్షన్ సూపర్డెంట్ శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, మహబూబాబాద్ తహసిల్దార్ రాజేశ్వర్, సిబ్బంది రాజు, ఇమాద్, రంజిత్, తదితరలు పాల్గొన్నారు.



## 22/ఏ భూముల సమస్యపై టీడీపీ పోరుబాట
## రైతులకు అండగా మల్కాజిగిరి కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా



వేకువ సమయం సెప్టెంబర్ 16 కీసర ప్రతినిధి : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా : 22/ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలను సత్వరమే పరిష్కరించి రైతులు, భూ యజమానులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మల్కాజిగిరి కలెక్టరేట్ వద్ద టీడీపీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. 22/ఏ కింద భూములు నిషేధిత జాబితాలో ఉండటంతో వాటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో సంబంధిత భూ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో నిషేధిత జాబితాలో ఉన్న భూములను అధికారులు సమగ్రంగా పరిశీలించి, అర్హత ఉన్న భూములను సత్వరమే 22/ఏ జాబితా నుంచి తొలగించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కోసం అవసరమైన పత్రాలతో వచ్చిన బాధితుల భూములను పరిశీలిస్తామని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గతంలో హామీ ఇచ్చినట్లు కూడా నివేదికలు వెలువడ్డాయి. ధర్నా అనంతరం టీడీపీ నాయకులు అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 22/ఏ బాధిత రైతులు, భూ యజమానుల సమస్యలను ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు, అరవింద్ కుమార్ గౌడ్, మల్కాజిగిరి పార్లమెంట్ అధ్యక్షుడు కందికంటి అశోక్ గౌడ్, మేడ్చల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ సుంకరి వెంకటేష్, తంగళ్ళపల్లి శంకర్ తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. “22/ఏ బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు” అని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు.

## మిల్లుల మూత.. ఉపాధికి వేత...

సుల్తానాబాద్(కరీంనగర్): సమస్యలు పరిష్కరించాలని జిల్లాలోని రైస్‌మిల్లర్లు మిల్లులు మూసివేశారు. విల్లులపై ఆధార పడిన కార్మికులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 150 బాయిల్డ్ మిల్లులు ఉన్నాయి. సమస్యలు పరిష్కరించాలని మిల్లర్లు ఈనెల 7వ తేదీ నుంచి మిల్లుల బంద్ పాటిస్తున్నారు. విద్యుత్ ఖర్చులు నాలుగు రెట్ల పెరుగుదల, సార్టెక్స్, గ్రేడర్ల, ఎఫ్ఆర్‌కే బియ్యం తదితర నిబంధనల వల్ల 450 హెచ్‌పీ నుంచి 600 హెచ్‌పీ విద్యుత్ సామర్థ్యంతో మిల్లులు నడుపుతున్నందున నిర్వహణ భారం పెరిగిందని, మిల్లింగ్ చార్జీలు ప్రభుత్వం పెంచడం లేదని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశా బ్దాల కిందట ఉన్న ధర ఇస్తున్నారని, అయినా నష్టాలను భరిస్తూ కార్మికులకు ఉపాధి చూపుతున్నామని మిల్లర్లు పేర్కొంటున్నారు. జిల్లాలోని గోదాముల్లో మిల్లింగ్ అవుతున్న బియ్యాన్ని ఎఫ్‌సీఐ త్వరగా సేకరించడం లేదని, మిల్లుల్లో నెలవారి మిల్లింగ్ సామర్థ్యంలో కేవలం ఎనిమిది రోజులు మాత్రమే డెలి వరీ అవుతున్నాయని, మిగిలిన 22 రోజులు మిల్లులు ఖాళీగా ఉంటున్నాయని వ్యాపారులు పేర్కొన్నారు. బ్యాంక్ వడ్డీలు, సిబ్బంది జీతభత్యాలు, విద్యుత్ చార్జీలు భారంగా మారి మిల్లులు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నాయని వాపోతు న్నారు. ఎఫ్‌సీఐ అధికారులు అనవసరపు కొర్రీల మూలంగా లారీ కిరాయిలు ఇతరత్రా నష్టపోతున్నామని పేర్కొంటున్నారు.మిల్లర్లపై కొందరు కావాలని ప్రభుత్వానికి తప్పుడు సమాచారాన్ని అందిస్తున్నారని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము 15 ఏళ్ళుగా యేటా 80 నుంచి 90 లక్షల మంది రైతులకు మద్దతుగా నిలుస్తూ దాదాపు పది కోట్ల టన్నుల ధాన్యాన్ని జీరో నష్టం లేకుండా ప్రభుత్వానికి మిల్లింగ్ చేశామని పేర్కొంటున్నారు. 2022-23 సీజన్‌కు సంబంధించి నాలుగు వేల కోట్ల భారాన్ని మిల్లర్లు భరించారు. రబీ బాయిల్డ్ రైస్ సంక్షోభ సమయంలో ప్రభుత్వం ధాన్యం సేకరణ చేయగా, మిల్లర్లు నాలుగు వేల కోట్లు చెల్లించి యాభై శాతం పైగా ధాన్యాన్ని టెండర్ ద్వారా తీసుకున్నామని, రెండేళ్ళ గడువు పూర్తయినా వంద శాతం పేమెంట్ చేసిన మిల్లర్లకు రావలిసిన చార్జీలు, రాయితీలు ప్రభుత్వం విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాలోని గోదాముల్లో రెండు లక్షల టన్నుల ధాన్యాన్ని రెండేళ్ల పాటు నిల్వ చేయడం వల్ల గోదాముల కిరాయిలు, హమాలీ చార్జీలు, తేమ తగ్గడం వల్ల క్వింటాలుకు 18 నుంచి 25 శాతం వరకు నష్టం వచ్చిందని, మిల్లర్లు ప్రభుత్వానికి వన్ పర్సంట్ నష్టం రానివ్వకుండా, వంద శాతం ధాన్యం అమౌంట్‌ను సొంత ఖర్చులతో చెల్లించి నిబద్ధత చాటుకున్నామని మిల్లర్లు వివరిస్తున్నారు. 2025 -26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 20 లక్షల టన్నుల ధాన్యం పది నెలలుగా మిల్లర్ల వద్దనే నిల్వ ఉంటుంది. కేవలం 70 శాతం డెలివరీకి ఆర్డర్లు ఇచ్చి మిగిలిన ఐదు లక్షల టన్నుల కు ఇప్పటి వరకు ఆర్డర్లు లేకుండా పోయాయని మిల్లర్ల పేర్కొంటున్నారు. పది నెలల పాటు మిల్లుల్లో ధాన్యం నిలువ ఉండడం వల్ల వచ్చే సహజ బరువు తగ్గుదలను మిల్లర్లపై తోయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ధాన్యం ఇచ్చే సమయంలో బాయిల్డ్ రైస్‌గా అనుమతిస్తామని చెప్పి ఇప్పుడు బలవంతంగా రా రైస్ కింద ఇవ్వమనడం సరికాదని, ఎండల తీవ్రత వల్ల రా రైస్ బాయిల్డ్ చేస్తే ఇరవై శాతం కూడా బియ్యం కావని మిల్లర్లు పేర్కొంటున్నారు.

## పోషణ్ మాహ్‌పై శాఖల సమన్వయంతో విస్తృత అవగాహన





వేకువ సమయం సెప్టెంబర్ 16 కీసర ప్రతినిధి : మేడ్చల్-మల్కాజిగిరి పోషణ్ మాహ్ కార్యక్రమంలో భాగంగా మహిళలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికల్లో పోషకాహారంపై అవగాహన కల్పించి, పోషకాహార లోపాన్ని నివారించేందుకు జిల్లా స్థాయి కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజన్ అహ్మద్ మార్గదర్శకత్వంలో జిల్లా సంక్షేమ అధికారి ఆధ్వర్యంలో వివిధ లైన్ డిపార్ట్మెంట్ల అధికారులతో సమావేశం జరిగింది. వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, విద్య, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ తదితర శాఖల సమన్వయంతో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలకు సమతుల్య ఆహారం, పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, రక్తహీనత నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహార సేవలను అర్హులైన వారికి సమర్థవంతంగా అందించడంతో పాటు, పోషణ్ ట్రాకర్‌లో లబ్ధిదారుల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. “మా అంగన్వాడీ.. మా బాధ్యత” అనే లక్ష్యంతో పోషణ్ మాహ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్ పేర్కొన్నారు.

## వరంగల్ డి కన్వెన్షన్ హాల్లో 27 నా ఎవరి కులం
## వారికంత వాటా బహిరంగ పంచాయతీ (సభ) కరపత్ర ఆవిష్కరణ

**మహబూబాబాద్ జిల్లా బీసీ ఎస్సీ, ఎస్టీ, జేఏసీ, కన్వీనర్ ముంజాల రాజేందర్ గౌడ్ పిలుపు**



మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 16(వేకువ సమయం ప్రతినిధి): రాష్ట్ర బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆదేశానుసారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ మద్దతుతో, బీసీ ఎస్టీ, ఎస్సీ- జేఏసీ ఆధ్వర్యంలో తేది:27.09.2026 ఆదివారం మధ్యాహ్నం 12.గం.లకు ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో హంటర్ రోడ్” డీ” కన్వెన్షన్ హన్మకొండ లో ఎవరి కులం ఎంతో వారికంత వాటా బహిరంగ పంచాయతీ (సభ) కరపత్ర ఆవిష్కరణ చేయడం జరిగింది. మహబూబాబాద్ జిల్లాలో ఉన్న అన్ని కులాలు వారి జనాభా దమాషా ప్రకారం వారికంత వాటా రావాలని అన్ని కులాల నుండి సొంత వాహనాలు ఏర్పాటు చేసుకొని వచ్చి ఈ బహిరంగ పంచాయతీ సభను విజయవంతం చేయాలనీ మహబూబాబాద్ జిల్లా బీసీ ఎస్సీ, ఎస్టీ, జేఏసీ, కన్వీనర్ ముంజాల రాజేందర్ గౌడ్ పిలుపునివ్వడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అన్ని కులాలు ఏ విధంగానైతే పాల్గొన్నారో ఇప్పుడు మన హక్కుల రాజకీయా వాటా కోసం ఆ విధంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సాధించుకున్న తెలంగాణలో సబ్బండ కులాల వాటా కోసం పోరాడాల్సిన సమయం వచ్చింది కావున అన్ని కులాల ప్రతినిధులు మరియు నాయకులు అందరు పాల్గొనాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో గండి వీరేందర్ గౌడ్. కో కన్వీనర్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు, డి.ఎస్.పి, జిల్లా ఇంచార్జ్ రాంపక సుధాకర్ మహారాజ్, మంగళం పెల్లి రాజు మహారాజ్. కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు,దుగ్గి గోపాల్. రజక సంఘం రాష్ట్ర ఉప అధ్యక్షులు, మోత్కురి శంకర్, విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా కోశాధికారి, పెద్ది సైదులు ముదిరాజ్, జిల్లా అధ్యక్షులు,గుండెల్లి బిక్షపతి మహారాజ్ మాదిగ జాగృతి సంఘం జిల్లా అధ్యక్షులు,నేతుల వెంకన్న యాదవ్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు, దాసరి లక్ష్మి నివాస్ మహారాజ్, డి.ఎస్.పి. ఎం జె ఎస్, కన్వీనర్, ప్రశాంత్ మహారాజ్.కందిపటి ఉపేందర్ ఎం జె ఎస్, కురవి కన్వీనర్, గడ్డం సమ్మయ్య గౌడ్ మోకు దెబ్బ రాష్ట్ర కార్యదర్శి,వల్లెపు మల్లయ్య వడ్డారి సంఘం జిల్లా అధ్యక్షులు, కందుకూరి రవి,వల్లెపు వెంకన్న. వడ్డారి సంఘం, మందుల యాకన్నా, కొమ్ము మల్లయ్య మహారాజ్. నర్సిముల పేట మండల్ డి.ఎస్.పి కన్వీనర్. కొత్త యుగేందర్ రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షులు , రాయల రమేష్ మహారాజ్, వడ్లకొండ సుధాకర్ గౌడ్, మోకు దెబ్బ కేసముద్రం డివిజన్ అధ్యక్షులు, ఎండి. నాదీముద్దీన్. అల్ అన్సారీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## రేపల్లె గ్రామాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంటనే సందర్శించాలి

**బాధిత కుటుంబానికి రక్షణ, ఆర్థిక సహాయం అందించాలి - బిఎస్పీ**



జోగులాంబ గద్వాల్ : జోగులాంబ గద్వాల్ జిల్లా, గద్వాల్ మండలం, రేపల్లె గ్రామంలో చోటుచేసుకున్న ఘటనపై బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్పీ) నాయకులు స్పందించారు. బిఎస్పీ జోగులాంబ గద్వాల్ జిల్లా అధ్యక్షులు మణికుమార్ గారి అధ్యక్షతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్, పార్లమెంట్ ఇంచార్జ్ మాసన్నతో పాటు జిల్లా నాయకులు రేపల్లె గ్రామాన్ని సందర్శించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ మాట్లాడుతూ రేపల్లె గ్రామంలో చోటుచేసుకున్న ఘటనను ఖండించారు. ఇద్దరు మేజర్లు పరస్పర ఇష్టంతో వివాహం చేసుకున్న నేపథ్యంలో ఏర్పడిన సమస్యను హైదరాబాద్ పోలీసులు పరిష్కరించినప్పటికీ, అనంతరం అమ్మాయి తరపు బంధువులు అబ్బాయి కుటుంబానికి చెందిన ఇంటిని కూల్చివేయడం బాధాకరమని అన్నారు.అత్యాధునిక సమాజంలో కూడా కులం, లింగం, వర్ణం, మతం ఆధారంగా వివక్షకు చోటు ఉండకూడదని పృథ్వీరాజ్ అన్నారు. బాధిత కుటుంబానికి చెందిన ఇంటిని కూల్చివేసిన ఘటనపై బాధ్యులను గుర్తించి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అదేవిధంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గారు వెంటనే స్పందించి రేపల్లె గ్రామాన్ని సందర్శించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించాలని మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో కుల వివక్షను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రతి నెల 30వ తేదీన గ్రామాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని బిఎస్పీ నాయకులు కోరారు. ప్రతి నెల సివిల్ రైట్స్ డే నిర్వహించడం ద్వారా ప్రజలకు రాజ్యాంగ హక్కులు, పౌర హక్కులపై అవగాహన పెరిగి, కుల వివక్షను తగ్గించే అవకాశం ఉంటుందని తెలిపారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఇంటిని పునర్నిర్మించి ఇవ్వడంతో పాటు ఆర్థిక సహాయం అందించాలని, వారి ధన, మాన, ప్రాణాలకు పూర్తి రక్షణ కల్పించాలని బిఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిఎస్పీ జోగులాంబ గద్వాల్ జిల్లా అధ్యక్షులు మణికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు సుదర్శన్ అబ్రహం మాట్లాడారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు రాంబాబు, జిల్లా నాయకులు శాంతిరాజ్, దేవన్న, నరేష్, గోవింద్, దుబ్బన్న, బొల్లి కురుమయ్య, దాసరి అశోక్, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.





# సర్పంచుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి





**గ్రామ పంచాయతీల నిధులను ఫ్రీజ్ చేయకుండా వినియోగానికి అవకాశం కల్పించాలి. సర్పంచులకు గౌరవ వేతనం పెంచాలి: మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్.**

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ సర్పంచుల సంఘం JAC–2026 ఆధ్వర్యంలో నిర్వహించిన సర్పంచుల సమావేశానికి మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.... గ్రామంలోని అన్ని శాఖలను సమన్వయం చేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత సర్పంచ్‌పై ఉంటుందని అన్నారు. విద్యుత్ సమస్య, రైతుబంధు, సాగునీరు, తాగునీరు, పాఠశాలల్లో సౌకర్యాలు వంటి ఏ సమస్య వచ్చినా ప్రజలు ముందుగా సర్పంచ్‌నే ఆశ్రయిస్తారని తెలిపారు. రాష్ట్రానికి సచివాలయం ఎలాగో గ్రామానికి గ్రామ సచివాలయం అలాంటిదేనని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో గ్రామాల్లో ప్రజలు నివసించే పరిస్థితులను మెరుగుపరిచేందుకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ప్రకృతి వనాలు, పార్కులు, డ్రైనేజీలు, బాత్‌రూమ్‌లు, ఇంటింటికీ నల్లా నీరు వంటి మౌలిక వసతులు కల్పించామని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులకు రాష్ట్ర ప్రభుత్వ వాటాను జోడించి గ్రామ పంచాయతీలకు నిధులు అందించామని, సర్పంచులకు గ్రామ అభివృద్ధి, పరిపాలనపై శిక్షణ కూడా కల్పించామని చెప్పారు. సర్పంచ్ ఏ పార్టీకి చెందినవారనే తేడా లేకుండా గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించిన పరిస్థితి గతంలో ఉండేదని అన్నారు.సర్పంచుల పోరాటం కారణంగా కొంతమేర పెండింగ్ బిల్లులు విడుదలయ్యాయని, అయితే ఇంకా పెండింగ్‌లో ఉన్న బిల్లులు, గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులను పూర్తిగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర జనాభాలో 60–70 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నందున గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను సమానంగా గ్రామ పంచాయతీలకు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీల ఖాతాల్లో నిధులు ఉన్నప్పటికీ వాటిని వినియోగించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీజ్ చేస్తుందన్నారు.90 రోజుల పాలనలో సర్పంచులు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారని, ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేసి, సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలో రైతులు, మహిళలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, పాలిటెక్నిక్ విద్యార్థులు, ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, గీత కార్మికులు, చేతివృత్తిదారులు అన్నివర్గాల వారు సమస్యలను ఎదుర్కొంటు న్నారన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు కూడా మొదలయ్యాయని అన్నారు. కాళేశ్వరం నీటిని వదిలిపెట్టడంతో ఆంధ్రప్రదేశ్ వాటిని వినియోగించుకుంటోందని, కృష్ణా, తుంగభద్ర నదుల నీటిని వెలిగొండ, పోతిరెడ్డిపాడు ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాజెక్టులకు నీటిని తరలిస్తున్నారని, ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ సుమారు 70 టీఎంసీల నీటిని వినియోగించుకుంటే తెలంగాణకు సుమారు 7 టీఎంసీలే వచ్చాయన్నారు. సర్పంచుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులు, నిధులు విడుదల చేయాలని, గ్రామ పంచాయతీల నిధులపై ఆంక్షలు తొలగించాలని డిమాండ్ చేశారు. సర్పంచుల గౌరవ వేతనం పెంచాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణను రూపొందించి, సమస్యల సాధన కోసం ఉద్యమాన్ని చేపడతామని వి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ సర్పంచ్ ల సంఘం జేఏసీ 2026 వ్యవస్థాపక అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్, ఉపాధ్యక్షులు కూరె వెంకటేష్, కార్యదర్శి గురుదాస్, విక్రమ్, జూకంటి అనిల్, సుభాష్, విద్ది మోహన్ రావు, నవీన్, నిరంజన్ రెడ్డి, ఎర్ర రమేష్, శాతరాజు సనత్ కుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 20న కామ్రేడ్ జ్యోతి సంస్మరణ సభ
## సంస్కరణ సభ కరపత్రాల ఆవిష్కరించిన సిపిఐ నేతలు



అమరచింత : అకాలంగా మృతి చెందిన సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి విజయ రాములు సతీమణి, పంచాయతీ కార్యదర్శి కామ్రేడ్ జ్యోతి సంస్మరణ సభను ఈనెల 20న ఆదివారం ఉదయం పది గంటలకు అమరచింత శ్రీకృష్ణ నగర్ లో నిర్వహిస్తున్నట్లు సిపిఐ మండల కార్యదర్శి అబ్రహం,సిపిఐ మక్తల్ నియోజకవర్గ కార్యదర్శి శ్రీహరి, సిపిఐ అమరచింత పట్టణ కార్యదర్శి రవీందర్ తెలిపారు. బుధవారం అమరచింత మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జ్యోతి సంస్మరణ సభ ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ నేతలు అబ్రహం, శ్రీహరి,రవీందర్ మాట్లాడుతూ చిన్న వయసులోనే క్యాన్సర్ మహమ్మారి కబళించి 15 రోజుల్లోనే కామ్రేడ్ జ్యోతి మృత్యువాత పడడం అత్యంత బాధాకరమని అన్నారు. జ్యోతి జిల్లా కార్యదర్శి విజయరాములు పోరాటాలకు అర్ధాంగిగా ఎంతో తోడ్పాటున అందించారని అన్నారు. జ్యోతి మరణం కమ్యూనిస్టు పార్టీకి కుటుంబానికి తీరని లోటు అని అన్నారు. ఈ సంస్కరణ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, మత్స్య, పశు సమర్ధత, క్రీడలు మరియు యువజన సర్వీసెస్ శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, శాసనమండలి సభ్యులు, ప్రజా వాగ్గేయ కారులు డాక్టర్ గోరేటి వెంకన్న, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహ, మక్తల్ మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి,ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పి,లక్ష్మణ్, నాస్తిక సమాజం నేత జె. సత్యనారాయణ,అమరచింత మున్సిపల్ చైర్మన్ జింక సువర్ణ రవి, వైస్ చైర్మన్ రాధా అరుణ్ లతోపాటు వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు వామపక్ష ప్రజా సామాజిక ఉద్యోగ సంఘాలు అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు జ్యోతి సంస్మరణ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.సురేష్,సిపిఐ నేతలు సీ.నరసింహ శెట్టి, శ్యాంసుందర్,ఎం.రఘు, భాస్కర్, కథలప్ప,ఆర్,యన్,కుమార్, ఇజ్రాయిల్, నవదీప్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి యం.డి.కుతూబ్ తదితరులు పాల్గొన్నారు.




రాష్ట్రంలోని అన్ని రంగాలు, అన్ని వర్గాలను బలోపేతం చేసేలా బ్యాంకులు విస్తృతంగా రుణాలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. 236వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో బ్యాంకర్లు, అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. రుణాల లక్ష్యాలను చేరుకున్నప్పుడే ఎస్ఎల్‌బీసీ సమావేశాల నిర్వహణకు సార్థకత ఉంటుందని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈలకు గతంతో పోలిస్తే ఈసారి రుణాల మొత్తం పెరిగినప్పటికీ.. ఆశించిన స్థాయిలో రుణాల మంజూరు జరగలేదని చంద్రబాబు అన్నారు. కొన్ని బ్యాంకులు రుణాల మంజూరులో చాలా వెనుకబడి ఉన్నాయని పేర్కొంటూ.. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా చర్యలు తీసు కోవాలని సూచించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్ర స్థానంలో నిలపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చంద్రబాబు తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధిం చేందుకు బ్యాంకులు పెద్దఎత్తున రుణాలు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలో 15 శాతం ఆర్థిక వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ ఎల్‌నినో కారణంగా ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. వాటిని అధిగమించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కౌలు రైతులకు కూడా సమృద్ధిగా రుణాలు అందేలా బ్యాంకులు ముందుకు రావాలని సీఎం సూచించారు.

## UPI MDR యూపీఐ ఎండీఆర్ ఛార్జీలపై 18 శాతం జీఎస్టీ... ట్యాక్స్ ఎక్స్‌పర్ట్స్ ఏమన్నారంటే

**సమయం ప్రతినిధి :** రూ,2,000 కంటే ఎక్కువ విలువైన యూపీఐ చెల్లింపులపై వ్యాపారులు చెల్లించే మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)పై 18 శాతం జీఎస్టీ పడనుంది. అయితే అర్హత ఉన్న వ్యాపారులు ఈ జీఎస్టీని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)గా క్లెయిమ్ చేసుకోవచ్చని పీటీఐ కథనం వెల్లడించింది. దీంతో వారిపై పడే మొత్తం పన్ను భారం తగ్గుతుందని ట్యాక్స్ నిపుణులు బుధవారం తెలిపారు. అక్టోబర్ 15 నుంచి వ్యాపారులకు చేసే యూపీఐ చెల్లింపులు (పీ2ఎం) రూ.2,000 దాటితే 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ వర్తిస్తుంది. అయితే ఈ ఛార్జీ గరిష్ఠంగా రూ.300కి పరిమితం అవుతుంది. రైల్వేలు, టెలికాం సర్వీసులు, ఇన్సూరెన్స్, ఇంధనం వంటి కొన్ని ప్రత్యేక వ్యాపార కేటగిరీల్లో రూ.2,000కు పైబడిన లావాదేవీలకు రూ.5 ఫ్లాట్ కన్‌సెషనల్ ఎండీఆర్ వర్తిస్తుంది. రూ.2,000 కంటే ఎక్కువ విలువ ఉన్న పీ2ఎం యూపీఐ లావాదేవీల వాటా కూడా క్రమంగా పెరుగుతోంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం పీ2ఎం యూపీఐ లావాదేవీల్లో ఇది 15.1 శాతంగా ఉండగా, 2026–27 ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికానికి 20.1 శాతానికి పెరిగింది. యూపీఐలో ఎక్కువ విలువ ఉన్న వ్యాపార చెల్లింపులు పెరుగుతున్న విషయాన్ని ఇది చూపిస్తోంది. ప్రతిపాదిత విధానం ప్రకారం, పేమెంట్ సెటిల్‌మెంట్ సర్వీసులకు సంబంధించిన ఛార్జీని వ్యాపారులే ఎండీఆర్ రూపంలో భరించాలి. పేమెంట్ నెట్‌వర్క్ ద్వారా డిజిటల్ చెల్లింపులను ప్రాసెస్ చేసి సెటిల్ చేసే సేవకు ఈ ఛార్జీ తీసుకుంటారు. అందుకే ఎండీఆర్‌పై 18 శాతం జీఎస్టీని వ్యాపారుల నుంచి వసూలు చేస్తారు. ఏఎంఆర్‌జీ గ్లోబల్ మేనేజింగ్ పార్ట్‌నర్ రజత్ మోహన్ మాట్లాడుతూ, రూ.2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ తీసుకురావడం వల్ల దేశ డిజిటల్ పేమెంట్ వ్యవస్థపై జీఎస్టీ పరంగా గణనీయమైన ప్రభావం ఉంటుందని చెప్పారు. చట్టపరమైన విధానం ప్రకారం, వ్యాపారుల నుంచి వసూలు చేసే ఎండీఆర్‌పై పేమెంట్ సెటిల్‌మెంట్ సర్వీసులకు 18 శాతం జీఎస్టీ వర్తిస్తుంది. ఈ ఎండీఆర్ ఛార్జీల వల్ల ప్రభుత్వానికి ఏడాదికి సుమారు రూ.3,500 కోట్ల నుంచి రూ.4,000 కోట్ల వరకు అదనపు జీఎస్టీ ఆదాయం రావచ్చని అంచనా. అయితే ఇందులో ముఖ్యమైన ఊరట కూడా ఉందని రజత్ మోహన్ చెప్పారు. ఈ ఛార్జీలను భరించే రిజిస్టర్డ్ వ్యాపారులు, తాము చెల్లించిన జీఎస్టీపై ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) క్లెయిమ్ చేసుకోవచ్చు. దీంతో వారిపై పడే మొత్తం పన్ను భారం గణనీయంగా తగ్గుతుంది. నాంగియా గ్లోబల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ – ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ శివకుమార్ రామ్‌జీ మాట్లాడుతూ, ఈ విధానంలో యూపీఐ ద్వారా చెల్లించే అసలు లావాదేవీ మొత్తంపై జీఎస్టీ ఉండదని చెప్పారు. కేవలం 0.4 శాతం మర్చంట్ ఫీజుపైనే 18 శాతం జీఎస్టీ వర్తిస్తుందని తెలిపారు. పెద్ద సంస్థలు జీఎస్టీ కింద రిజిస్టర్ అయి ఉంటే ఈ పన్ను వల్ల పెద్దగా అదనపు భారం ఉండదని రామ్‌జీ చెప్పారు. ఎందుకంటే వారు చెల్లించిన జీఎస్టీ మొత్తాన్ని పూర్తిగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌గా క్లెయిమ్ చేసుకోవచ్చు. మరోవైపు, చిన్న వ్యాపారులు, రూ.2,000లోపు లావాదేవీలకు మినహాయింపులు ఉండటం వల్ల చిన్న స్థాయి రిటైల్ వ్యాపారాలపై ఈ విధానం ప్రభావం ఉండదని చెప్పారు. జీఎస్టీ వ్యవస్థలో తమ అమ్మకాలపై అవుట్‌పుట్ ట్యాక్స్ చెల్లించే వ్యాపారులు ఐటీసీని క్లెయిమ్ చేసుకోవచ్చని రామ్‌జీ తెలిపారు. అయితే జీఎస్టీ నుంచి మినహాయింపు ఉన్న వస్తువులు లేదా సేవలతో వ్యాపారం చేసే వ్యాపారులు ఎండీఆర్‌పై పడే జీఎస్టీ భారాన్ని తమే భరించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న లావాదేవీల పరిమాణాన్ని చూస్తే, యూపీఐలోని మొత్తం ఆర్థిక విలువలో అధిక విలువ ఉన్న పీ2ఎం చెల్లింపులకు గణనీయమైన వాటా ఉంది. ఈ నేపథ్యంలో ఎండీఆర్‌పై జీఎస్టీ విధించే విధానం వల్ల ప్రభుత్వానికి ఏడాదికి రూ.5,000 కోట్లకు పైగా కొత్త జీఎస్టీ ఆదాయం రావచ్చని రామ్‌జీ అంచనా వేశారు. ఈ మార్పు ద్వారా ప్రభుత్వం కొత్త ఆదాయ వనరును ఏర్పాటు చేసుకోవడంతో పాటు పేమెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు అవసరమైన నిధులు సమకూర్చుకోగలదని రామ్‌జీ చెప్పారు. అదే సమయంలో, దేశంలో రిటైల్ డిజిటల్ చెల్లింపులు పెరగడానికి కారణమైన జీరో–ఫీ అనుభవాన్ని కొనసాగించవచ్చని ఆయన అన్నారు. ఈవై ఇండియా ట్యాక్స్ పార్ట్‌నర్ సౌరభ్ అగర్వాల్ మాట్లాడుతూ, ఎండీఆర్ ఛార్జీలపై 18 శాతం జీఎస్టీ విధిస్తారని, ఈ ఛార్జీని బ్యాంకులు వ్యాపారుల నుంచి వసూలు చేస్తాయని చెప్పారు. అయితే బ్యాంకు ఈ ఛార్జీలను విడిగా చూపించే స్టేట్‌మెంట్ లేదా జీఎస్టీ ఇన్‌వాయిస్ ఇస్తే, ఆ మొత్తాన్ని వ్యాపారి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌గా క్లెయిమ్ చేసుకోవచ్చని అగర్వాల్ తెలిపారు. ఆ ఐటీసీని వ్యాపారి తన అవుట్‌పుట్ జీఎస్టీ బకాయిని చెల్లించేందుకు సర్దుబాటు చేసుకోవచ్చని చెప్పారు. ఏకేఎం గ్లోబల్ లీడ్ – ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ ఇకేష్ నాగ్‌పాల్ మాట్లాడుతూ, కొత్తగా ప్రకటించిన ఎండీఆర్‌పై 18 శాతం జీఎస్టీ వర్తిస్తుందని చెప్పారు. అయితే ఈ జీఎస్టీ యూపీఐ ద్వారా పంపే అసలు డబ్బుపై కాకుండా, పేమెంట్ సర్వీస్ ఛార్జీపై మాత్రమే ఉంటుందని తెలిపారు. చెల్లించిన ఈ జీఎస్టీని అర్హత ఉన్న వ్యాపారులు ఐటీసీగా క్లెయిమ్ చేసుకోవచ్చని చెప్పారు. రూ.2,000 కంటే ఎక్కువ విలువైన వ్యాపారి చెల్లింపులు నెలకు రూ.6 లక్షల కోట్లుగా ఉన్నాయని పేర్కొంటూ నాగ్‌పాల్ ఒక లెక్క చెప్పారు. మొత్తం మొత్తంపై 0.4 శాతం ఎండీఆర్ ఒకే విధంగా వర్తిస్తే, నెలకు సుమారు రూ.432 కోట్ల జీఎస్టీ వస్తుందని, ఏడాదికి ఇది సుమారు రూ.5,184 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. అయితే ఇది కేవలం సూచనాత్మక లెక్క మాత్రమేనని చెప్పారు. వ్యాపారులకు లభించే మినహాయింపులు, తక్కువ రేటుతో ఉండే ఛార్జీలు, లావాదేవీలపై ఉన్న గరిష్ఠ పరిమితులను ఇందులో పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. అర్హత ఉన్న వ్యాపారులు ఎండీఆర్‌పై చెల్లించిన జీఎస్టీని ఐటీసీగా క్లెయిమ్ చేసుకోవచ్చు కాబట్టి, ప్రభుత్వానికి వాస్తవంగా వచ్చే అదనపు ఆదాయం రూ.5,184 కోట్ల కంటే తక్కువగా ఉండొచ్చని నాగ్‌పాల్ వివరించారు. మొత్తంగా చూస్తే, రూ.2,000 దాటిన యూపీఐ వ్యాపార చెల్లింపులపై ఎండీఆర్ అమల్లోకి వస్తే, దానిపై 18 శాతం జీఎస్టీ పడుతుంది.




# షష్టి పూర్తి.. పలు చిత్రాలకు స్ఫూర్తి

నాటి మేటి నటులు నటరత్న యన్టీఆర్ – నటసమ్రాట్ ఏయన్నార్ ఇద్దరికీ హిట్ పెయిర్‌గా అలరించిన జమున.. తరువాతి రోజుల్లో హరనాథ్‌తోనూ సక్సెస్ రూటులో సాగారు. యన్టీఆర్ 'సీతారామ కళ్యాణం'లో శ్రీరామునిగా నటించిన హరనాథ్ కు 'యన్టీఆర్ మెచ్చిన రాముడు' అనే పేరుండేది. ఎందుకంటే, తెలుగువారికి శ్రీరాముడు అనగానే ముందుగా గుర్తుకు వచ్చే నటుడు యన్టీఆరే. అలాగే యన్టీఆర్ తరువాత అంతటి అందగాడు అనే పేరు కూడా సంపాదించారు హరనాథ్. అలాంటి హరనాథ్‌తో జమున జోడీ కట్టిన పలు చిత్రాలు ప్రేక్షకులను అలరించాయి. వాటిలో మిన్నగా ఆకట్టుకున్న సినిమా 'లేతమనసులు' . ఏవీయమ్ సంస్థ తమిళంలో నిర్మించిన 'కుళందైయుమ్ దైవముమ్' సినిమా ఆధారంగా 'లేతమనసులు' తెరకెక్కింది. అసలు 'కుళందైయుమ్ దైవముమ్' చిత్రానికి 'ద పేరెంట్ ట్రాప్' అనే హాలీవుడ్ మూవీ ఆధారం. జర్మన్ రచయిత ఎరిక్ కాస్ట్నర్ రాసిన 'లిసా అండ్ లోట్టి' అనే నవలతో 'ద పేరెంట్ ట్రాప్' తెరకెక్కింది. 'కుళందైయుమ్ దైవముమ్' లోనూ జమున నాయికగా నటించారు. అందులో ఆమె కూతుళ్ళుగా ద్విపాత్రాభినయం చేసిన కుట్టి పద్మిని తెలుగులోనూ తన పాత్రలోనే కనిపించారు. తమిళ చిత్రాన్ని రూపొందించిన దర్శకద్వయం కృష్ణన్–పంజు 'లేతమనసులు'నూ తెరకెక్కించారు. 1966 సెప్టెంబర్ 16వ తేదీన విడుదలైన 'లేతమనసులు' ఆ యేడాది టాప్ గ్రాసర్స్‌లో ఒకటిగా నిలచింది. లేతమనసులు' కథ విషయానికి వస్తే.. కలవారి అమ్మాయి సత్యభామ, సామాన్యుడైన శేఖర్ ప్రేమించి పెళ్ళి చేసుకుంటారు. వారికి కవల పిల్లలు పుడతారు. సత్యభామ తల్లి కారణంగా శేఖర్ భార్య నుంచి విడిపోతాడు. తనతో పాటు ఓ కూతురును తీసుకువెళతాడు. తరువాత శేఖర్ దగ్గర పెరిగే అమ్మాయి, సత్యభామ వద్ద ఉండే కూతురు ఇద్దరూ ఒకే స్కూల్‌లో కలుసుకోవడం.. వారికి తాము కవల పిల్లలమన్న నిజం తెలియడం జరుగుతాయి. తరువాత పప్పీ, లల్లీ ఇద్దరూ తమ కన్నవారిని కలపడమే కథ. ఈ కథ స్ఫూర్తితో తరువాత ఎన్నో సినిమాలు తెరకెక్కాయి. ఇదే కథతో హిందీలో 'దో కలియా', మళయాళంలో 'సేతుబంధనం', కన్నడలో 'మక్కల భాగ్య' రూపొందాయి. తమిళ, తెలుగు, హిందీ చిత్రాలకు కృష్ణన్–పంజు దర్శకత్వం వహించారు. ఈ మూడు సినిమాలను ఏవీయమ్ సంస్థ నిర్మించింది. హిందీలో ఈ నాటి మేటి హీరో రణబీర్ కపూర్ తల్లి నీతూసింగ్ బాలనటిగా ద్విపాత్రాభినయం చేశారు.



# అనంత్ నాగ్‌కు అత్యున్నత పురస్కారం

భారతీయ చలనచిత్ర రంగంలో ఇచ్చే అత్యున్నత, అత్యంత ప్రతిష్టాత్మక పురస్కారం 'దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు' (2024 సంవత్సరానికి గాను) దిగ్గజ నటుడు అనంత్ నాగ్ ను వరించింది. భారతీయ సినిమాకు ఆయన అందించిన అసమానమైన సేవలు, తరతరాలకు స్ఫూర్తినిచ్చిన ఆయన సుదీర్ఘ నట ప్రయాణాన్ని గౌరవిస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ మహోన్నత గౌరవాన్ని ప్రకటించింది. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ఎంపిక కమిటీ చేసిన సిఫార్సుల మేరకు భారత ప్రభుత్వం ఈ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ సెప్టెంబర్ 22న గుజరాత్‌లోని ఏక్తా నగర్ (కేవడియా) వేదికగా అత్యంత వైభవంగా జరగనున్న 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో అనంత్ నాగ్‌కు ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. ప్రధానంగా కన్నడ చిత్ర పరిశ్రమలో దశాబ్దాల పాటు తన సహజ సిద్ధమైన నటన, వైవిధ్యమైన పాత్రలతో తిరుగులేని గుర్తింపు తెచ్చుకున్న అనంత్ నాగ్.. జాతీయ స్థాయిలో భారతీయ సినిమా గర్వించదగ్గ నటులలో ఒకరిగా నిలిచారు. తెలుగులోనూ ఆయన అనేక చిత్రాలలో నటించారు. మరీ ముఖ్యంగా 'కెజియఫ్' మొదటి పార్ట్ స్టోరీని అనంత్ నాగ్ రన్ చేసిన విధానానికి ఫ్యాన్స్ ఉన్నారంటే అతిశయోక్తి కానే కాదు. అలాగే తెలుగులో నితిన్ హీరోగా వచ్చిన 'భీష్మ' చిత్రంలో ఆయన ఓ కీలక పాత్రను పోషించారు. అనంత్ నాగ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం దక్కడంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక అభినందనలు తెలిపారు. "దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపికైన లెజెండరీ నటుడు అనంత్ నాగ్ గారికి హృదయపూర్వక అభినందనలు. కొన్ని దశాబ్దాలుగా ఆయన ప్రదర్శించిన సహజ నటన, అద్భుతమైన వైవిధ్యం భారతీయ చిత్ర పరిశ్రమపై, ముఖ్యంగా కన్నడ సినిమాపై బలమైన ముద్ర వేశాయి. ఆయన ఏ పాత్ర పోషించినా అందులో అరుదైన గాంభీర్యం, ప్రామా ణికత కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. నిజంగా ఓ విశిష్ట కళాకారుడికి దక్కిన అర్హమైన గౌరవం ఇది" అని ప్రధాని ప్రశంసించారు. అనంత్ నాగ్‌కు ఈ అత్యున్నత పురస్కారం లభించడంపై దేశవ్యాప్తంగా సినీ ప్రముఖులు, అభిమానులు పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



# ఇది సూరి, సుహాస్‌ల సునామి!

టాలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ సుహాస్, కోలీవుడ్ సెన్సేషనల్ స్టార్ సూరి ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'మండాడి' . ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్‌పై ఎల్రెడ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రానికి మతిమారన్ పుగళేంది దర్శకత్వం వహించారు. మహిమా నంబియార్, సీనియర్ నటుడు సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ కీలక పాత్రలు పోషించిన ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో ప్రతిష్టాత్మక మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పి సెప్టెంబర్ 10న గ్రాండ్‌గా విడుదల చేసింది. తొలి ఆట నుంచే అద్భుతమైన మౌత్ టాక్ దక్కించుకున్న ఈ చిత్రం ప్రస్తుతం రికార్డు స్థాయి వసూళ్లతో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. తెలుగు, తమిళ భాషల్లో విడుదలైన అన్ని కేంద్రాల్లో 'మండాడి' ప్రభంజనం సృష్టిస్తోంది. తాజాగా ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ. 65 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించినట్లు నిర్మాతలు అధికారిక పోస్టర్ ద్వారా ప్రకటించారు. విడుదలైన అతి తక్కువ సమయంలోనే ఈ రేంజ్ కలెక్షన్లు రాబట్టడం ట్రేడ్ వర్గాలను సైతం విస్మయానికి గురిచేస్తోంది. లాంగ్ రన్‌లో ఈ సినిమా మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయమని.. సూరి, సుహాస్‌ల కెరీర్‌లోనే బిగ్గెస్ట్ కమర్షియల్ బ్లాక్‌బస్టర్‌గా 'మండాడి' నిలుస్తుందని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. సినిమాలో వచ్చే బోట్ సీక్వెన్స్‌లు, హై–వోల్టేజ్ రేసింగ్ ఎపిసోడ్లు ఒళ్లు గగుర్పొడిచేలా ఉండి ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి. పీటర్ హెయిన్, దిలీప్ సుబ్బురాయన్, మహేష్ మాథ్యూ సంయుక్తంగా కంపోజ్ చేసిన యాక్షన్ సీన్లు థియేటర్లలో ప్రేక్షకులను సీట్ ఎడ్జ్‌పై కూర్చోబెడుతున్నాయి. వీటికి తోడు కథిర్ అందించిన టాప్–నాచ్ సినిమాటోగ్రఫీ, జీవీ ప్రకాష్ కుమార్ సమకూర్చిన అదిరిపోయే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్లాయి. కథను నడిపించిన తీరుతో పాటు సూరి, సుహాస్‌ల నేచురల్ యాక్టింగ్, వారి మధ్య సాగే సన్నివేశాలు చిత్రానికి వెన్నెముకగా నిలిచాయి.

Cinema




# చిరు 'కాకా' ఏం చేస్తాడో..?

పాన్ ఇండియా స్థాయిలో వరుస భారీ ప్రాజెక్టులతో ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించిన ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ ప్రస్తుతం తీవ్రమైన గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. వివిధ భాషల్లో భారీ బడ్జెట్‌లతో అగ్ర నటులతో సినిమాలు నిర్మించినప్పటికీ.. ఆ సంస్థ ఖాతాలో సరైన ఒక్క హిట్ కూడా పడకపోవడం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటివరకు కేవీఎన్ బ్యానర్‌లో వచ్చిన చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద వరుసగా పరాజయం పాలై నిర్మాతలకు ఊహించని నష్టాలను మిగిల్చాయి. గతేడాది కన్నడలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన యాక్షన్ డ్రామా 'కేడీ: ది డెవిల్'బాక్సాఫీస్ వద్ద అతిపెద్ద డిజాస్టర్‌గా నిలిచింది. ఆ తర్వాత కోలీవుడ్ దళపతి విజయ్‌తో నిర్మించిన ప్రతిష్టాత్మక తమిళ చిత్రం 'జననాయగన్' కంటెంట్ పరంగా తీవ్ర విమర్శలపాలై కమర్షియల్‌గా ఘోరంగా ఫెయిలైంది. మలయాళంలో విడుదల చేసిన 'బాలన్ ది బాయ్' కూడా ప్రేక్షకుల నుంచి ఆశించిన స్థాయిలో ఆదరణ దక్కించుకోలేక చతికిలబడింది. ఇక రాకింగ్ స్టార్ యష్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్లాన్ చేసిన 'టాక్సిక్' సైతం ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలోనే బిగ్గెస్ట్ డిజాస్టర్‌గా మిగిలిపోయింది. తాజాగా బాలీవుడ్‌లో రిలీజైన 'హైవాన్' సినిమాకు కనీస ప్రేక్షకాదరణ కరువై, బాక్సాఫీస్ వద్ద మినిమం ఓపెనింగ్స్ కూడా రాబట్టలేక బోల్తా కొట్టింది. ఇలా అన్ని భాషల్లో ఎదురైన వరుస వైఫల్యాలతో డీలా పడ్డ కేవీఎన్ ప్రొడక్షన్స్‌కు ఇప్పుడు ఒకే ఒక్క ఆశాకిరణం కనిపిస్తోంది. టాలీవుడ్‌లో మెగాస్టార్ చిరంజీవి హీరోగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారీ చిత్రం 'కాకా'. సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి రాబోతున్న ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. పండుగ బరిలో మెగాస్టార్ చూపే మాస్ మేనియా, బాక్సాఫీస్ స్టామినాపై నిర్మాతలు కొండంత నమ్మకంతో ఉన్నారు. కేవీఎన్ పరువును నిలబెట్టి, వారి వరుస ఫెయిల్యూర్స్‌కు ఫుల్‌స్టాప్ పెట్టే బాధ్యత ఇప్పుడు పూర్తిగా 'కాకా' భుజస్కంధాలపైనే పడింది. అన్ని ఇండస్ట్రీలలో ఎదురుదెబ్బ తిన్న కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థకు టాలీవుడ్ ఎలాంటి విజయాన్ని ఇస్తుందో? సంక్రాంతి బరిలో చిరంజీవి ఇచ్చే హిట్ ఈ నిర్మాణ సంస్థను మళ్లీ ట్రాక్‌లోకి ఎక్కిస్తుందో లేదో తెలియాలంటే.. ఇంకా మూడు నెలలకు పైగా వెయిట్ చేయాల్సిందే.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085